R.N.I.NO : APTEL16159

# జనసూర్య శ్రీ

janasurya. com

సంపుటి : 2 | సంచిక : 196 | అనంతపురము | సంపాదకులు : ఓగేటి భాస్కర | మంగళవారం 7 నవంబర్ 2023 | పేజీలు -10 | వెల : 5

# ప్రజా వైద్యం పూర్తి బాధ్యత ప్రభుత్వందే

- సీఎం జగన్ కీలక వ్యాఖ్యలు
- జగనన్న ఆరోగ్య సురక్షపై కలెక్టర్లతో సీఎం జగన్ సమీక్ష
- ముగింపు దశకు వైద్య శిబిరాల నిర్వహణ
- ఇకపైనే అసలు పని అంటూ సీఎం జగన్ వ్యాఖ్యలు
- పేషెంట్ల ప్రయాణ ఖర్చులకు రూ.500
- నిర్ణీత సమాయానికి చికిత్సతో పాటు మందులు
- ఆరోగ్యశ్రీలో కవర్ కాని కేసులపై ప్రత్యేక దృష్టి
- చికిత్స తర్వాత కూడా పర్యవేక్షణ ఉంటుందని స్పష్టీకరణ
- రాబోయే రోజుల్లో ఏం చేయాలన్నదానిపై అధికారులకు దిశానిర్దేశం



**గుంటూరు**

జగనన్న ఆరోగ్య సురక్ష కింద నిర్వహించిన శిబిరాలు సాధారణ వైద్య శిబిరాలు కావని, పేషెంట్ల జబ్బు నయం అయ్యేదాకా పూర్తిస్థాయిలో చేయూత నివ్వడమే ప్రభుత్వ ఉద్దేశమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారుల వద్ద ప్రస్తావించారు. సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారాయన. జగనన్న ఆరోగ్య సురక్షలో ఇప్పటిదాకా పురోగతిని వివరిస్తూనే.. రాబోయే రోజుల్లో ఏం చేయాలన్నదానిపై అధికారులకు -మిగతా3లో

## తెదేపా కరువు బృందం అరెస్ట్



- రాత్రి అయినా రోడ్డుపైనే భోజనం, బైఠాయించి... నిరసన
- 470 కరువు మండలాలుగా ప్రకటించాలి – సోమి రెడ్డి
- ఈ ప్రభుత్వము వల్ల రైతులకు ఎలాంటి లాభం లేదు – ప్రత్తిపాటి
- రేపు సీఎం జగన్ మోహన్ రెడ్డిని అడ్డుకుంటాం – కాలువ
- తెలుగు తమ్ముళ్ల కు పోలీసులకు వాగ్వాదం

**(శ్రీ సత్య సాయి జిల్లా)మడకశిర నవంబర్ 6 (జనసూర్య శ్రీ):-**

మండల పరిధిలోని ఉగ్రేపల్లి, కదిరేపల్లి, కోడిగానపల్లి గ్రామాలలో తెలుగుదేశం పార్టీ కరువు బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వేరుశనగ చెట్లను పీకి వేరుశనగ విత్తనాలు విత్తినప్పటినుంచి నుంచి వర్షం రాక రైతులు పూర్తిగా నష్టపోయారని ఈ బృందం తీర్మానించింది. ఈ సందర్భంగా మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయారనీ అందువల్ల రాష్ట్రం మొత్తం మీద 470 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల పూర్తిస్థాయిలో ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా ఈ ప్రభుత్వం రైతులకు -మిగతా2లో

## నాటి పాదయాత్ర ఫలితమే నేటి సంక్షేమం

- చరిత్రలో నిలిచేలా సాగిన ప్రజా సంకల్ప పాదయాత్ర
- రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా ప్రజాసంక్షేమ పాలన
- టీడీపీ హయాంలో అడుగడుగునా వంచన
- కేంద్రంలో భాగస్వామిగా ఉన్నా ఫలితం శూన్యం
- ఈనెల 9 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం
- ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతాం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ
- ఘనంగా ప్రజాసంకల్ప పాదయాత్ర ఆరేళ్ల వేడుక
- మహానేత వైఎస్ఆర్ విగ్రహానికి ఘన నివాళి
- కేక్ కట్ చేసి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణుల సంబరం



**అనంతపురం, బ్యూరో నవంబర్ 6 (జనసూర్యశ్రీ)**

రాష్ట్రంలో ప్రతిపక్ష హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర ఫలితాలే ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాలు అని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రజా సంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వైసీపీ శ్రేణులు నగరంలో వేడుకలు నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అక్కడే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ తెలుగుదేశం పాలనలో ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా సుదీర్ఘ పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. 341 రోజుల పాటు 3648 కిలోమీటర్లు ప్రజలతో మమేకమయ్యారని అన్నారు. నేను విన్నాను.. నేను ఉన్నాను అంటూ సాగిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందన్నారు. 2014లో జనసేన మద్దతుతో టీడీపీ, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం -మిగతా2లో

## 10 పరిక్షే



**అమరావతి. నవంబర్ 6 (జనసూర్యశ్రీ):** రాబోవు కాలంలో పదవ తరగతి పరీక్షలు ఉండవని సోషల్ మీడియాలో రకరకాలుగా మెసేజ్ లు వస్తున్నాయని, వీటిని చూసి ముఖ్యంగా విద్యార్థులు మోసపోవద్దని రాష్ట్ర ఎడ్యుకేషన్ బోర్డు డైరెక్టర్ డి దేవానంద రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానంలో కూడా 10 తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు కచ్చితంగా ఉంటాయని స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దు కచ్చితంగా పరీక్షలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు

## పెద్ద ఎత్తున పట్టుబడ్డ ఎర్రచందనం

- 5 మంది తమిళనాడు కు చెందిన అంతరాష్ట్ర ఎర్రచందన స్మగ్లర్లు అరెస్ట్ మరియు సుమారు 4.49 కోట్ల రుపాయుల విలువగల ఎర్ర చందనం, 2 కార్లు స్వాదీనం.
- సుమారు 4,31,07,200/- రూపాయల విలువ కలిగిన 5,388 కేజిల 275 ఎర్ర చందనం దుంగలు, ముక్కలు, పొడి , సుమారు 18,00,000/- విలువ గల రెండు కార్లు, నగదు 3200/- రూపాయలు, 6 సెల్ ఫోన్స్ స్వాధీనం. మొత్తం విలువ 4,49,07,200/- రూపాయలు.
- ఎన్ హెచ్ జాతీయ రహదారిపై పెద్ద పన్నంగాడు ఆంధ్ర బార్డర్ చెక్ పోస్ట్ వద్ద సూళ్లూరుపేట సిఐ మధుబాబు, తడ ఎస్ఐ శ్రీనివాస రెడ్డి, సూళ్లూరుపేట ఎస్ఐ బ్రహ్మనాయుడు తడ, సూళ్ళురుపేట పోలీస్ స్టేషన్ ల సిబ్బంది మాటువేసి స్మగ్లర్లను అరెస్టు చేశారు.
- పట్టుబడిన ముద్దయిలందరూ తమిళనాడు వాసులే.
- ఏ1.మురుగన్ ఇదివరకే పి డి యాక్ట్ క్రింద జైలు శిక్షను అనుభవించి, జూన్ నెలలో విడుదల అయ్యాడు..అయినప్పటికీ మళ్ళి ఎర్రచందనం స్మగ్లింగ్ కు పాల్పడుతుండగా అరెస్ట్.
- అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటుతో పటిష్టమైన చర్యలు.. ఫలితంగా నేడు అక్రమ రవాణాకు అడ్డుకట్ట.
- అక్రమ రవాణాకు పాల్పడిన, సహకరించిన వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.
- ముద్దాయిలపై పిడి యాక్ట్ ప్రయోగం.
- జిల్లా ఎస్పి పి.పరమేశ్వర రెడ్డి ఐపిఎస్.



**తిరుపతి నవంబర్ 6 (జనసూర్యశ్రీ)**

కేసు వివరాలు జిల్లా ఎస్పి పి.పరమేశ్వర రెడ్డి ఐపిఎస్ సోమవారం నాడు తిరుపతి పోలీసు పెరేడ్ మైదానం నందు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, కేసు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ నాయుడుపేట ఎస్డిపిఓ రాజగోపాల్ రెడ్డి పర్యవేక్షణలో సబ్ డివిజన్ సిబ్బంది తిరుపతి జిల్లా, నాయుడుపేట సబ్ డివిజన్, సూళ్ళురుపేట సర్కిల్, తడ పోలీస్ స్టేషన్ పరిధిలో నిన్నటి దినం 6నఉదయం ఎన్ హెచ్‌బి16 రహదారిపై పెద్ద పన్నంగాడు ఆంధ్ర బార్డర్ చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తిరుపతి నుండి తమిళనాడు వైపుకి అతి వేగంగా రావడాన్ని గమనించిన సిబ్బంది, అప్రమత్తమై చాకచక్యంగా ఆ వాహనాలను అదుపు చేసి తమిళనాడు కు చెందిన అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన 5 మంది ఎర్ర చందనం స్మగ్లర్స్ ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు 4,31,07,200/- రూపాయల విలువ కలిగిన 5,388 %ఖస్త్ర% ల 275 ఎర్ర చందనం -మిగతా2లో

# పెద్ద ఎత్తున పట్టుబడ్డ ఎర్రచందనం

-మొదటి పేజి తరువాయి

దుంగలు, ముక్కలు, పొడి మరియు సుమారు 18,00,000/- విలువ గల రెండు కార్లు, నగదు 3200/- రూపాయలు, 6 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ 4,49,07,200/- రూపాయలు. పట్టుబడిన ముద్దయిలందరూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారే. ఇది మాకు రాబడిన ఖచ్చితమైన సమాచారం మేరకు అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ముద్దాయిలు తిరుపతి పరిసర ప్రాంతాల నుండి ఎర్ర చందనమును సేకరించి తమిళనాడు రాష్ట్రంలో పెద్ద స్మగ్లర్ల గోడౌన్ల లో భద్ర పరచి, తదుపరి అట్ట పెట్టెలలో ప్యాకింగ్ చేసి, దుంగలను పసుపు పొడి రవాణా ముసుగులో ఎవరికీ అనుమానం కలుగకుండా లోడ్ మధ్యలో పెట్టి వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి తరిలిస్తున్నట్లు సమాచారం తెలిసిందన్నారు. ఈ ముఠా వెనకున్న పెద్ద స్మగ్లర్ల కోసం గాలింపు చేపడుతున్నాము తిరుపతి పరిసర ప్రాంతాలలో ఈ ముఠాకి సహాయ సహకారాలు అందిస్తున్న వారిని కూడా గుర్తించి అరెస్టు చేయడం చేసి ఈ స్మగ్లర్ల నెట్వర్క్ ను పూర్తిగా చేదించి ఎర్రచందనం స్మగ్లింగ్ ను అరికట్టతామన్నారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రత్యేకమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి ఉన్నాము. అవసరమైన రహదారుల యందు చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి, పటిష్ట మైన చర్యలు తీసుకుంటున్నాము. నిఘా వ్యవస్థ బృందాలను ఖచ్చితమైన సమాచారం కోసం ఇతర రాష్ట్రాల్లో కూడా ఏర్పాటు చేయడం జరిగింది. శేషాచలం సంపదను కాపాడుకోవడం మన విధి, అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉపేక్షించేది లేదు. ఇప్పటికే ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థ ద్వారా మరిన్ని దాడులు నిర్వహించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. అందులో భాగంగా అవసరమైన ప్రతిచోట నిఘా వ్యవస్థ సమాచారం మేరకు ప్రతి రోజు విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేపట్టాలని అధికారులకు సూచించడం జరిగింది. ఫలితంగా నిన్న ఎర్ర చదనం స్మగ్లర్ల ను అడ్డుకుని మన జాతీయ సంపదను కాపాడటం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రజలకు ఎవరికైనా ఎర్రచందనం స్మగ్లింగ్ కు సంబంధించిన ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు చేరవేసి, భారత జాతీయ సంపద అయిన ఎర్రచందనం కాపాడటంలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచి, అవసరమైతే వారికి భద్రతను కల్పిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి ఐపీఎస్. ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అరెస్ట్ అయిన ముద్దాయిల వివరాలు మురుగన్ అలియాస్ మురుగానంద్ షోళవరం, చెన్నై (ఎర్ర చదనం రవాణాదారుడు). హేమంత్ కుమార్ అలియాస్ రాజ అలియాస్ హరి పల్లవరం, చెన్నై, (ఎర్ర చదనం అమ్మే మధ్యవర్తి). రవి చెన్నై, ( డ్రైవర్ వర్కర్)విమల్ ,షోళవరం, చెన్నై, ( డ్రైవర్ వర్కర్) సురేందర్ షోళవరం, చెన్నై ( డ్రైవర్ , వర్కర్). పట్టుబడిన ముద్దాయిలలో ఇద్దరిపై పాత కేసులు ఉన్నాయి. ఏ1 మురుగన్ పై 17 ఎర్రచందనం కేసులు, ఏ2 హేమంత్ కుమార్ పై 03 ఎర్రచందనం కేసులు నమోదు అయినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. ఏ1. మురుగన్ పై తిరుపతి రెడ్ శాండల్ టాస్క్ ఫోర్సు పోలీసులు ప్రయోగించిన పీడీ యాక్ట్ కేసు క్రింద జైలు శిక్షను అనుభవించి, జూన్ నెలలో విడుదల అయ్యాడు. అయినప్పటికీ పరివర్తన చెడకుండా మళ్ళి ఎర్రచందనం స్మగ్లింగ్ కు పాల్పడుతుండగా అరెస్ట్ చేశామన్నారు. మిగిలిన వారిపై కూడా పక్క జిల్లాలలో గానీ, ఇతర రాష్ట్రాల్లో గానీ ఏమైనా కేసులు నమోదయి ఉన్నాయా అని ఆరా తీస్తున్నాము. అయితే ఇప్పుడు ముద్దాయి లందరిపై పిడి యాక్ట్ యోగిస్తామన్నారు. ఈ కేసు చేదనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాయుడు పేట డి.యస్.పి రాజగోపాల్ రెడ్డి, సూళ్లూరుపేట సి.ఐ మధుబాబు, యస్.ఐ లు శ్రీనివాస రెడ్డి తడ, బ్రహ్మనాయుడు సూళ్లూరుపేట మరియు తడ, సూళ్ళూరుపేట పోలీసు స్టేషన్ల సిబ్బంది ఏ.యస్.ఐ రాఘవయ్య, హెచ్.సి లు శీనయ్య, సురేష్, పి.సి లు సుహేల్ బాబు, శివ కుమార్, శంకర్, వెంకటేశ్వర్లు, నాగార్జున, వెంకటేశ్వర్లు, చంద్ర శేఖర్, హొంగార్డ్ లు శ్రీను, చంద్ర శేఖర్, చంద్ర అయిన వారిని జిల్లా ఎస్పి పి.పరమేశ్వర రెడ్డి ఐపిఎస్ అభినందించి ప్రశంశా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శాంతి భద్రత కులశేఖర్, సూళ్లూరుపేట సిఐ మధుబాబు, ఎస్ఐలు శ్రీనివాసరెడ్డి తడ, బ్రహ్మనాయుడు సూళ్లూరుపేట మరియు తడ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా వైద్యం పూర్తి బాధ్యత ప్రభుత్వందే

-మొదటి పేజి తరువాయి

దిశానిర్దేశం చేశారాయన. ఈ సమీక్షలో సీఎం జగన్ మాట్లాడుతూ.. "జగనన్న ఆరోగ్య సురక్ష చాలా ముఖ్యమైనది. వైద్య శిబిరాల నిర్వహణ దాదాపు చివరి దశకు వచ్చింది. 10,032 గ్రామ సచివాలయాల్లో దాదాపు 98శాతం, వార్డు సచివాలయాల్లో 77శాతం శిబిరాల నిర్వహణ పూర్తైంది. శిబిరాల్లో గుర్తించిన పేషెంట్లకు చేయూతనివ్వడం చాలా ముఖ్యం. ఇవి సాధారణమైన సాధారణ వైద్య శిబిరాలు కావు. శిబిరాల నిర్వహణ పూర్తయ్యాక అసలు పని మొదలవుతుంది. శిబిరాల్లో గుర్తించిన పేషెంట్లకు పూర్తిస్థాయిలో చేయూత నివ్వడం అనేదే అత్యంత ముఖ్యమైంది" అని ఆయన అన్నారు. ఒక కుటుంబంలో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వాళ్లకు పూర్తిగా నయం అయ్యేంతవరకూ చేదోడుగా నిలవడమే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారాయన. "ఈ కార్యక్రమంలో మొదటి అడుగుగా ప్రతి ఇంటికీ వెళ్లి జల్లెడపడుతూ, అందరికీ పరీక్షలు నిర్వహించాం. ఆ పేషెంట్లను శిబిరానికి తీసుకురావడం, పరీక్షలు నిర్వహించడం, అక్కడ మందులు ఇవ్వడం జరుగుతోంది. అర్బన్ ఏరియాల్లో 91 శాతం, రూరల్ ఏరియాల్లో 94శాతం స్క్రీనింగ్ పూర్తయ్యింది.

1.44 కోట్ల కుటుంబాల్లోని వారికి ఇప్పటికే స్క్రీనింగ్ పూర్తిచేశారు. 6.4 కోట్ల ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించారు. ఇప్పుడు మనం జనగనన్న సురక్ష కార్యక్రమం చివరిదశలో ఉన్నాం. ఇప్పటికే దీనికి సంబంధించిన ఒక యాప్‌ను మనం వాడుతున్నాం. క్యాంపులకు వచ్చే ప్రతి ఒక్కరి వివరాలు తీసుకుంటున్నాం. వారి ఆరోగ్య పరిస్థితులను యాప్ ద్వారా నమోదు చేస్తున్నాం. ఈ సమాచారం ఆధారంగా తదుపరి చికిత్సలు ఎక్కడ చేయించాలనే దానిపై మన దగ్గర డేటా ఉంది" అన్నారాయన.

. 'జగనన్న సురక్ష క్యాంపుల్లో నవంబర్ 5 కల్లా 85వేల మంది పేషెంట్లను తదుపరి చికిత్సలకోసం నెట్‌వర్క్ ఆస్పత్రి/ టీచింగ్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. వీరికి చేయూత నివ్వడం ఒక కార్యక్రమం. మొబైల్ యాప్ ద్వారా ట్రాక్‌చేసి, వారిని ఆయా ఆస్పత్రులకు మ్యాప్ చేయాలి. ఆ తర్వాత విలేజ్ క్లినిక్‌కు, ఫ్యామిలీడాక్టర్‌కు, గ్రామ సచివాలయంలోని వైద్య ఆరోగ్య సిబ్బందితో అనుసంధానం చేయించాలి. వారి ద్వారా వీరికి నయం అయ్యేంతవరకూ తగిన విధంగా చర్యలు తీసుకోవాలి. 13,850 కేసులను ఇప్పటివరకూ చేయూత నిచ్చి వారిని తదుపరి చికిత్సలకోసం ఆస్పత్రులకు పంపించడం జరిగింది. మిగిలిన వారిని కూడా ఆస్పత్రులకు పంపించి వారికి మంచి చికిత్స అందించేలా తగిన చర్యలు తీసుకోవాలి. వారికి కావాల్సిన మందులు ఇచ్చి.. వారిని నయం అయ్యేంత వరకూ కూడా తగిన విధంగా చేయూత నివ్వాలి' అని అధికారుల్ని సీఎం జగన్ ఆదేశించారు.

.. "మిగిలిన ప్రాంతాల్లో క్యాంపులు నిర్వహించి గుర్తించిన మొత్తం రిఫరెల్ కేసులన్నింటికీ కూడా తదుపరి చికిత్సలు అందించే కార్యక్రమం డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తిచేయాలి. వీరు చికిత్సలు చేయించుకున్న తర్వాత ఇంటికి వచ్చాక వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారికి కావాల్సిన మందులు అందించడంతోపాటు, వారు వేసుకునేలా తగిన విధంగా చేయూత నివ్వాలి. రిఫరల్ ఆస్పత్రులకు వెళ్లేందుకు ఈ పేషెంట్లకు రూ.500లు ప్రయాణ ఖర్చులు కూడా ఇవ్వాలి. ఒకవేళ ఆరోగ్య శ్రీ ప్రొసీజర్‌లో కవర్ కాని కేసులు అక్కడక్కడా ఉండొచ్చు. ఫ్యామిలీ డాక్టర్ రిఫరెన్స్ ద్వారా జిల్లా ఆస్పత్రికి, బోధనాసుపత్రులకు పంపించి ఉచితంగా వైద్య చికిత్సలు అందించాలి. అలాంటి రోగాలకు కూడా ఆరోగ్య శ్రీకింద ఉచితంగా చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలి" అని సూచించారు సీఎం జగన్.

జనవరి 1 నుంచి క్రమం తప్పకుండా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించాలన్న సీఎం జగన్.. ప్రతి నెలా మండలంలో నాలుగు క్యాంపులు నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారుల్ని ఆదేశించారు. అలాగే.. ఆరోగ్య శ్రీ కింద నమోదుకాని రోగాలు ఏమైనా కనిపించినా.. ప్రత్యేక కేసుల కింద పరిగణించి వారికి ఉచితంగా ఆరోగ్య శ్రీ కింద చికిత్సలు అందచేయాలన్నారు. అలాంటి పేషెంట్ల చికిత్సకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని



అధికారులతో అన్నారాయన.

ఆరోగ్య శ్రీ కింద చికిత్సలు చేయించుకున్న పేషెంట్లపై దృష్టిపెట్టడం అనేది మరొక విషయం. చికిత్సలు చేయించుకున్న తర్వాత వీరికి అందిన వైద్యంపై పూర్తి వివరాలు కనుక్కోవాలి. ఎలాంటి లంచాలకు తావులేకుండా ఉచితంగా వైద్యం అందిందా? లేదా? అనేది తెలుసుకోవాలి. వాళ్లు మందులు తీసుకుంటున్నారా? లేదా? అన్నదానిపై పరిశీలన చేయాలి. ఆరోగ్య శ్రీ సేవలందుకున్న రోగులకు ఏడాదిపాటు ఉచితంగా మందులు అందిస్తున్నాం. అయితే వాళ్లు క్రమం తప్పకుండా తిరిగి వీళ్లు ఆస్పత్రులకు వెళ్లి మందులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలి. పేషెంట్లకు తెలియక, సరైన అవగాహన లేక తదితర కారణాల వల్ల చికిత్సలు చేయించుకున్న రోగులు తిరిగి ఆస్పత్రులకు వెళ్లి మందులు తీసుకోని సందర్భాలు చూస్తున్నాం. ఇలాంటి పరిస్థితులు ఇకపై ఉండకూడదు. నిర్ణీత సమయానికి పేషెంట్లు వెళ్లి.. మందులు తీసుకునేలా చూడాలి. ఈమేరకు యాప్‌లో తగిన విధంగా ఫీచర్లు తీసుకొచ్చాం. అలాగే.. ఆ బాధ్యత విలేజ్ క్లినిక్స్‌కు, ఫ్యామిలీ డాక్టర్‌కు కూడా ఉంటుంది అని సీఎం జగన్ అన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల కింద గుర్తించిన పేషెంట్లకు నాణ్యమైన సేవలు అందించడం అన్నది అత్యంత ముఖ్యమైన విషయం. ఇప్పటిదాకా 8.7 లక్షల మందికి కంటి పరీక్షలు చేయించుకున్నారు. 5.22 లక్షల మందికి కంటి అద్దాలు ఇవ్వాలని డాక్టర్లు చెప్పారు. వీరికి వెంటనే కంటి అద్దాలు అందించేలా చర్యలు తీసుకోవాలి. అలాగే 73 వేలమందికిపైగా కంటి సర్జరీలు చేయాలని వైద్యులు చెప్పారు. ఆ సర్జరీలు కూడా వెంటనే పూర్తి కావాలి. డిసెంబర్ నెలాఖరు నాటికి ఈ కార్యక్రమాలన్నీకూడా పూర్తికావాలి అని సీఎం జగన్, అధికారులకు ఆదేశించారు.

ఇంకా ఏమన్నారంటే.. "హైపర్ టెన్షన్, డయాబెటిస్ ఉన్నట్టుగా గుర్తించిన వారికి తదుపరి నిర్ధారణ పరీక్షలు చేయించాలి. అందులోకూడా నిర్ధారణ అయిన తర్వాత వారి ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి. ప్రివెంటివ్ కేర్‌లో ఇది కీలక అంశం. అలాగే 9,969 మందికి లెప్రసీ అనుమానాస్పద కేసులు ఉన్నాయి. వీరికి వెంటనే నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి. అలాగే 442 మందికి టీబీ ఉన్నట్టుగా నిర్ధారణ అయ్యింది. సుమారు 1, 239 మంది చిన్నారులు 4-%ణ% సమస్యలతో బాధపడుతున్నట్టుగా తేలింది:

వీరికి అవసరమైన చికిత్సలు అందించడంపై దృష్టిపెట్టాలి. కాక్లియర్ ఇంప్లాంట్ లాంటి చికిత్సలు ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా అందించడం వల్ల ఆ పిల్లలు ఈ సమస్యలనుంచి బయటపడతారు.

ఇప్పటికే తీవ్రరోగాలతో బాధపడుతున్న వారికి తగిన రీతిలో చేయూత నందించాలి. ఈ మందులు ఖరీదైనవి కాబట్టి, వాళు మందులు కొనుక్కోలేని పరిస్థితిలో ఉన్నారు. అలాంటి వారికి కూడా మందులు అందించాలి. మందులు ఎంత ఖరీదైనా సరే, పేషెంట్లకు అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. గ్రామ వార్డు సచివాలయం, విలేజ్ క్లినిక్ ఆధారంగా మ్యాపింగ్ చేసి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో అనుసంధానం చేయాలి. రాబోయే రోజుల్లో ఆరోగ్య సేవలు మరింత విస్తరించనున్నాయి. పదిహేడు మెడికల్ కాలేజీల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ప్రతి జిల్లాలోకూడా అత్యాధునిక సేవలు అందించే బోధనాసుపత్రి అందుబాటులో ఉంటుంది. ఉన్న మెడికల్ కాలేజీలను కూడా పునరుద్ధరిస్తున్నాం. రిక్రూట్‌మెంట్ పాలసీమీద కలెక్టర్లు పూర్తిగా అవగాహన పెంచుకోవాలి. ఎక్కడైనా స్పెషలిస్టులు, డాక్టర్లు, ఇతర సిబ్బంది కొరత లేకుండా సంబంధిత జిల్లాల కలెక్టర్లు చూసుకోవాలి. ఇప్పటికే 53 వేలమందిని ఆరోగ్య రంగంలో ఖాళీలను మనం భర్తీచేశాం. ఎక్కడ ఖాళీలు ఉన్నా, వెంటనే భర్తీచేసేలా కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలి. ఆరోగ్య రంగాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్నాం కాబట్టే, మెడికల్ రిక్రూట్ బోర్డును సృష్టించడం జరిగింది. ప్రివెంటివ్ కేర్‌లో జగనన్న సురక్ష, విలేజ్ క్లినిక్, ఫ్యామిలీడాక్టర్ కాన్సెప్టులు అత్యంత కీలకం కానున్నాయి.

పౌష్టికాహారం లోపం, రక్తహీనత సమస్యలను పూర్తిగా నివారించాలి. ఈ సమస్యలతో బాధపడుతున్నవారికి సంపూర్ణ పోషణ కింద పౌష్టికాహారం అందుతుందా? వారికి మందులు అందుతున్నాయా? అనే విషయాల్ని విలేజ్ క్లినిక్ ద్వారా పరిశీలన చేయించాలి. లక్ష్యాలను సాధించడానికి దేశంలో ఏ రాష్ట్రంలోని కలెక్టర్లకు లేని యంత్రాంగం, మన రాష్ట్రంలో కలెక్టర్లకు ఉంది. విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, గ్రామ-వార్డు సచివాలయాల వ్యవస్థ ఉంది. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇలాంటి వ్యవస్థలు లేవు. సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనలో అన్ని రాష్ట్రాలకన్నా ముందు ఉంచేందుకు ఇవి ఉపయోగపడతాయి. కలెక్టర్లకు మంచి అభిరుచి ఉంటే కచ్చితంగా లక్ష్యాలు సాధిస్తాం. జనవరి 1 నుంచి క్రమంత తప్పకుండా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణ ఉండాలి. ప్రతి వారం కూడా మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించాలి. నెలలో నాలుగు క్యాంపులు నిర్వహించాలి. ఐదు నెలల్లో మళ్లీ అదే గ్రామంలో క్యాంపు నిర్వహణ సమయం వస్తుంది. దీనివల్ల సంతృప్త స్థాయిలో సేవలు అందుతాయి. ఆరోగ్య పరంగా ఎవరికి ఏ అవసరం వచ్చినా వారి అవసరాలు తీర్చడం మన బాధ్యత. అలాగే ఆరోగ్య శ్రీ సేవలు ఎలా పొందాలన్నదానిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి.

**నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకూ ఈ ప్రచారం నిర్వహించాలి:**

మంచి ఫీచర్లతో ఆరోగ్య శ్రీ కార్డులు ఇవ్వాలని ఇదివరకే ఆదేశాలు ఇచ్చాం. డిసెంబర్ 1 నుంచి ఆరోగ్య శ్రీ కార్డులు ఇవ్వాలి. ఆరోగ్య శ్రీని ఎలా పొందాలన్నదానిపై దానిపై ప్రతి ఒక్కరికీ తెలియాలి. ప్రతి ఒక్కరి ఫోన్‌లో ఆరోగ్య శ్రీ యాప్ ఉండాలి. ఆరోగ్య శ్రీ చికిత్స కోసం ఎక్కడకు వెళ్లాలన్నదానిపై పూర్తి వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. దీనిపై ఎలాంటి సందేహాలు ఎవ్వరికీ ఉండకూడదు. యాప్‌లోకి వెళ్తే సమీపంలోని ఎంపానెల్.. ఆస్పత్రికి మార్గం చూపిస్తుంది. లేకపోతే విలేజ్ క్లినిక్‌ను అడిగినా, అలాగే 104ను అడిగినా తగిన రీతిలో గైడ్ చేస్తారు. ఆరోగ్య శ్రీ సేవలను ఎలా పొందాలన్నదానిపై బుక్‌లెట్స్‌కూడా ప్రతి కుటుంబానికీ అందిస్తారు.

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం.. 2,295 ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందుతున్నాయి. అయినా వైద్యంకోసం ప్రజలు ఎందుకు తమ జేబుల్లోనుంచి డబ్బులు ఖర్చుచేసుకోవాల్సిన అవసరం ఏముంది?. అలాంటి పరిస్థితులు ఇకపై లేకుండా చూడటం మన అందరి బాధ్యత. ఆ దిశగా అడుగులు వేసే లక్ష్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష తీసుకొచ్చాం అని సీఎం జగన్ అన్నారు.

## నాటి పాదయాత్ర ఫలితమే నేటి సంక్షేమం

-మొదటి పేజి తరువాయి

అధికారంలోకి వచ్చినా చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమం శూన్యమని అన్నారు. ఆనాటి ప్రజాకంఠక పాలనపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని.. ఆ తర్వాత అదే ప్రజల విశ్వాసంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారన్నారు. పాదయాత్రలో ఏ కష్టాలైతే తెలుసుకున్నామో వాటికి పరిష్కార మార్గాలుగా పథకాలను రూపొందించి అమలు చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని తెలిపారు. కోవిడ్ వంటి పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు కొనసాగించామని గుర్తు చేశారు. ఈ రోజు అమ్మ ఒడి అందుతోందన్నా.. మహిళా సంఘాలకు రూ.19 వేల కోట్లు మాఫీ అయ్యాయన్నా.. పింఛన్ రూ.3 వేల వరకు పెరుగుతోందన్నా.. 45 ఏళ్లు నిండిన మహిళలకు వైఎస్ఆర్ చేయూత కింద ఏటా రూ.18500 అందుతోందన్నా.. అన్నీ కూడా నాటి ప్రజాసంకల్ప పాదయాత్ర ఫలితాలేనని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రజలకు ఇచ్చిన 98 శాతం హామీలను అమలు చేశామని తెలిపారు. రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలోనూ జరగని విధంగా రూ.800 కోట్లతో అనంతపురంలో అభివృద్ధి పనులు చేపట్టామని, ఇది సీఎంగా జగన్ ఉండడం వల్లే సాధ్యమైందని చెప్పారు. రూ.300 కోట్లతో సర్వజనాస్పత్రి విస్తరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు మంచి జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీలు మాత్రం ప్రజల దృష్టికి డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు 14 ఏళ్లు అధికారంలో ఉండి ఎందుకు సంక్షేమ పథకాలు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. వైద్య, విద్య రంగాల్లో ఎందుకు మార్పులు తీసుకురాలేకపోయారన్నారు. చంద్రబాబు పాలనకు, జగన్ పాలనకు తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఈనెల 9వ తేదీ నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ఈ రాష్ట్రానికి మళ్లీ జగన్ ఎందుకు అవసరమో ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. 76 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రజలకు మంచి జరగాలన్నా.. రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా సీఎం జగన్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు.

## తెదేపా కరువు బృందం అరెస్ట్




-మొదటి పేజి తరువాయి

చేసింది శూన్యం అన్నారు. కనీసం ఇప్పటికైనా స్పందించి రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఇది అతి తక్కువ వర్షపాతం నమోదు అయ్యే జిల్లా అని,ఇక్కడ వర్షాధారంపై పండే వేరుశనగ పంట పై ఎక్కువ ఆధారపడి ఉంటారనీ,వర్షం లేనందువలన రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. అందువలన ప్రభుత్వం నుంచి రాయితీనిస్తూ ఇన్సూరెన్స్, తప్పక పంట బీమా కూడా మంజూరయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాస్ మాట్లాడుతూ రేపు పుట్టపర్తికి రానున్న సీఎం జగన్మోహన్ రెడ్డిని అడ్డుకుంట అన్నారు. జిల్లా అధ్యక్షుడు పార్థసారథి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్రమ కేసులు, దౌర్జన్యాలు, రౌడీ ఇజాలు చేయడానికి సమయం వృధా చేశారు .కానీ రైతు పట్ల గాని, కార్మికుల పట్ల గాని ఎలాంటి చర్యలు లేవన్నారు. కాలవ శ్రీనివాస్ ప్రకటన విన్న పోలీసులు కరువు బృందాన్ని మొత్తాన్ని అరెస్టు చేశారు. తెలుగు తమ్ముళ్లు పోలీస్ స్టేషన్ దగ్గర రోడ్డుపై బటాయిస్తూ నిరసన వ్యక్తం చేశారు. సుమారు రాత్రి 9:30 అయినా అక్కడే బయట నుంచి రాత్రి భోజనం కూడా రోడ్డుపైనే తిన్నారు. అనంతరం పోలీసులు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో రెస్ట్ తీసుకోవాలని తెలుగు తమ్ముళ్లను విడిచారు. ఈ కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గ అబ్జర్వర్ పార్థసారథి రెడ్డి, కళ్యాణ దుర్గం ఇంచార్జ్ ఉమామహేశ్వర్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎంపీపీలు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ జడ్పిటిసిలు, అనుబంధ సంగం నాయకులు తదితరులు భారీగా పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు బీభత్సం

**విజయవాడ/తాడేపల్లి :**



విజయవాడలో ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ఫ్లాట్‌ఫామ్‌పైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. 12వ నంబర్ ఫ్లాట్‌ఫైమ్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాద ఘటనలో ముగ్గురు మృతిచెందారు. కండెక్టర్‌తో పాటు మరో ఇద్దరు మృతి చెందారు. మృతి చెందిన వారిలో 10 నెలల చిన్నారి కూడా ఉంది. బ్రేక్ ఫెయిల్ కావడంతోనే ఇలా జరిగిందని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. బస్సు విజయవాడ నుంచి గుంటూరుకు వెళ్లాల్సి ఉన్న సమయంలోనే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద ఘటనను పరిశీలించిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు.. అధికారుల నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. 'ఈరోజు ఉదయం 8:30 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటన దురదృష్టకరం. ప్రమాదంలో కుమారి అనే ప్రయాణీకురాలు, అవుట్ సోర్సింగ్ బుకింగ్ కండక్టర్ వీరయ్య ఘటనా స్థలంలోనే చనిపోయారు. మరో చిన్నారి అయాన్ష్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. ఘటన పై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మానవ తప్పిదమా...బస్సులో లోపమా తేలాల్సి ఉంది. సాయంత్రంలోగా ప్రాథమిక నివేదిక వస్తుంది. 24 గంటల్లోగా పూర్తి నివేదిక తీసుకుంటాం. గాయపడిన వారికి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నాం. మృతులకు ఆర్టీసీ తరఫున రూ. 5 లక్షలు తక్షణ నష్టపరిహారం అందిస్తాం' అని తెలిపారు.

**మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం**

విజయవాడ బస్టాండ్‌లో జరిగిన బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఉదయం ముఖ్యమంత్రికి ప్రమాద ఘటనపై వివరాలను అధికారులు అందించారు. ఆర్టీబస్సు ప్రమాదవశాత్తూ ఫ్లాట్‌ఫాంమీదకు దూసుకుపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుందని వివరించారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై విచారణ చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. ప్రమాదంలో మరణించినవారి కుటుంబాలకు వెంటనే పరిహారం అందించాలని, గాయపడ్డవారికి మెరుగైన చికిత్స అందించాలని సీఎం ఆదేశాలు జారీచేశారు.

# మహావినాశనం ముందుంది?



'యుగాంతం'.. 'మహావినాశనం' వీటికి సంబంధించిన చర్చలు ప్రపంచంలో కొత్తేమీకాదు. ఈ ఆసక్తికర అంశాలపై పలు సినిమాలు కూడా వచ్చాయి. అయితే తాజాగా మానవాళి అంతం గురించి అంచనా వేయడానికి నిపుణులు, శాస్త్రవేత్తలు అత్యాధునిక సూపర్ కంప్యూటర్లను ఉపయోగించారు.
యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బ్రిస్టల్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు మానవాళి భవిష్యత్ గురించి కంప్యూటర్ రూపొందించిన నివేదికలను అధ్యయనం చేశారు. భూమిమీద మానవజాతి ఎప్పుడు అంతరించిపోతుందో తెలుసుకున్నారు. దీని ప్రకారం యుగాంతం మనకు అత్యంత సమీపంలోనే లేకపోయినప్పటికీ, 250 మిలియన్ సంవత్సరాల (ఒక మిలియన్ అంటే పది లక్షలు) దూరంలో ఉన్నట్లు తేలింది.
అధ్యయనంలో పాల్గొన్న బ్రిస్టల్ విశ్వవిద్యాలయ పరిశోధకులు డాక్టర్ అలెగ్జాండర్ ఫార్న్స్‌వర్త్ మాట్లాడుతూ భూమిపై పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, విపరీతమైన వేడి కారణంగా మానవాళి మనుగడ దుర్భరంగా మారుతుందని అన్నారు. ఈ విధంగా మరణాలు విపరీతంగా సంభవిస్తాయని తెలిపారు. భవిష్యత్‌లో సూర్యుని నుంచి ఇప్పుడున్న దానికన్నా సుమారు 2.5 శాతం అధిక రేడియేషన్ విడుదల కానుంది. ఫలితంగా కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు ఇప్పటి కంటే రెండు రెట్లు అధికం కాగలవని ఆయన హెచ్చరించారు. ఈ నేపధ్యంలో అగ్ని పర్వత విస్ఫోటనాలతో ఏర్పడే సూపర్ ఖండం తేమతో కూడిన ఉష్ణమండల ప్రాంతాలను ఆక్రమిస్తుంది. ఫలితంగా భూభాగంలోని అధిక ప్రాంతాల్లో 40 నుండి 70 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు చేరుకునే అవకాశం ఉంది. ఈ నూతన సూపర్ ఖండం మానవాళికి మూడు రెట్ల ముప్పును కలిగిస్తుంది. మానవులు, జంతువులు, క్షీరదాలకు అననుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. పెరిగే రోజువారీ ఉష్ణోగ్రత తీవ్రతలు, అధిక తేమ స్థాయిలు కలసి మానవుల మనుగడకు అంతం పలకుతాయని ఫార్న్స్‌వర్త్ హెచ్చరించారు. అయితే ఈ విపత్తును నివారించడానికి శిలాజ ఇంధనాల వినియోగాన్ని నిలిపివేయడం ఒక్కటే మార్గమని ఆయన తెలిపారు. లీడ్స్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ బెంజమిన్ మిల్స్ మాట్లాడుతూ శిలాజ ఇంధన వినియోగంలో పెరుగుదల భూమిపై మానవాళి అంతాన్ని వేగవంతం చేస్తుందని, ఇప్పుడున్న పరిస్థితులే కొనసాగితే ఊహించిన దానికంటే ముందుగానే మానవాళి అంతానికి చేరుకోవచ్చని అన్నారు. భవిష్యత్‌లో భూమిపై నివాసయోగ్యంకాని సూపర్ ఖండం ఏర్పడినప్పుడు సంభవించే పరిణామాలు ఎలావుంటాయో తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు సూపర్ కంప్యూటర్లను వినియోగించి అధునాతన వాతావరణ నమూనాలను తెలుసుకునేందుకు పరిశోధనలు సాగిస్తున్నారు.

## ప్రమాదస్థాయిలో వాయు కాలుష్యం.. ఢిల్లీలో మళ్లీ సరి-బేసి విధానం



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. రోజు రోజుకీ వాయు నాణ్యత దారుణంగా పడిపో తుంది. మితిమీరిన కాలుష్యంతో నగర వాసులు ఉక్కిరిబిక్కిరవు తున్నారు. నగరాన్ని పొగ మంచు కమ్మేసింది. గత నాలుగు రోజులు కాలుష్యం ప్రమాద కర స్థాయిలోనే కొనసాగుతోంది. కాలుష్యం తీవ్ర స్థాయికి చేరడంతో వాయు నాణ్యత సూచీలు క్రమేపీ క్షీణిస్తున్నాయి. సోమవారం వాయు నాణ్యత సూచి(ఏక్యూఐ) 437కు చేరిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది. ఈ క్రమంలో కాలుష్య నియంత్రణకు ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో మరోసారి సరి- బేసి విధానాన్ని అమలు చేయనున్నట్లు రాష్ట్ర పర్యావరణశాఖ మంత్రి గోపాల్ రాయ్ వెల్లడించారు. నవంబర్ 13 నుంచి 20 వరకు ఈ విధానం అమల్లో ఉండనున్నట్లు పేర్కొన్నారు. ఈ విధానం ప్రకారం.. వాహన రిజిస్ట్రేషన్ నంబరు చివర సరి సంఖ్య ఉన్న వాహనాలు ఒక రోజు, బేసి సంఖ్య ఉన్న వాహనాలు మరో రోజు రోడ్లపైకి రావాల్సి ఉంటుంది. ఈ మేరకు దేశ రాజధానిలో కాలుష్య సంక్షోభంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో పర్యావరణవాఖ మంత్రి గోపాల్ రాయ్ సోమవారం సంబంధిత అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే సరి-బేసిపై నిర్ణయం తీసుకున్నారు. అంతకముందు వెల్లడించిన దాని ప్రకారం పెట్రోల్, డీసిల్ కార్లను నిషేధం సైతం కొనసాగుతుందని మంత్రి గోపాల్ రాయ్ తెలిపారు. ఇక ఢిల్లీలో ప్రస్తుతం ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని మంత్రి ఆదేశించారు. పాఠశాలలను కూడా మూసివేయాలని నిర్ణయించారు. 10, 12వ తరగతులు మినహాయించి మిగతా అన్ని పాఠశాలలు నవంబర్ 10 వరకు ఉంటాయని తెలిపారు. ఇప్పటివరకు ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే సెలవులు ప్రకటించగా.. ఇప్పుడు ఉన్నత పాఠశాలలను కూడా మూసివేస్తున్నట్లు వెల్లడించారు. అయితే 6 నుంచి 12 తరగతుల విద్యార్థులకు పాఠశాలలు తమ అనుకూలతను బట్టి ఆన్‌లైన్ క్లాస్‌లు నిర్వహించుకోవచ్చని సూచించారు.

## రష్యా అధికారిక కార్యక్రమాల్లో పుతిన్ డూప్?

రష్యా పలు అధికారిక కార్యక్రమాల కోసం అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డూప్ (బాడీ డబుల్స్)ను వినియోగిస్తున్నదంటూ సోషల్‌మీడియాలో తరచూ పలు ఊహాగానాలను షికారు చేస్తున్నాయి. అయితే వీటిని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ఖండించింది. క్రెమ్లిన్ అధ్యక్ష ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఇటువంటి వాదనలను వినోదం కోసమే చేస్తున్నారంటూ వ్యాఖ్యానించారు.

# బిల్లుల ఆమోదంలో జాప్యం..



**న్యూఢిల్లీ:** పలు రాష్ట్రాల్లో గవర్నర్ల తీరుపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. గవర్నర్లకు ఆత్మపరిశీలన అవసరమని వ్యాఖ్యానించింది. పంజాబ్ గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్ బిల్లుల ఆమోదించడంలో చేస్తున్న జాప్యంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ నేతృత్వంలోని ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం సోమవారం ఈ ఘాటు వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన బిల్లుల అంశం తమ వద్దకు చేరక ముందే గవర్నర్లు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బిల్లుల ఆమోదంలో జాప్యంపై దాఖలైన కేసుపై సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. 'బిల్లుల విషయాలు సుప్రీంకోర్టు వద్దకు రాకముందే గవర్నర్లు చర్యలు తీసుకోవాలి. గవర్నర్లు అలా వ్యవహరించినప్పుడే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయి. గవర్నర్‌లకు ఆత్మ పరిశీలన అవసరం. అలాగే వారు ఎన్నికైన ప్రజాప్రతినిధులు కాదన్న విషయం వారు తెలుసుకోవాలి' అని ధర్మాసనం పేర్కొంది. పెండింగ్ బిల్లులపై పంజాబ్ గవర్నర్ పురోహిత్ తీసుకున్న చర్యలకు సంబంధించిన తాజా పరిస్థితిపై నివేదికను నవంబర్ 10 నాటికి సమర్పించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటి వరకు విచారణను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఇదిలా ఉంటే... ముఖ్యమంత్రి భగవంత్ మాన్ నేతృత్వంలోని పంజాబ్ ప్రభుత్వానికి ఆ రాష్ట్ర గవర్నర్ పురోహిత్ మధ్య ఇటీవలి కాలంలో విభేధాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన 27 బిల్లుల్లో 22 బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలిపారు. కానీ... అక్టోబరు 20న నాల్గవ బడ్జెట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిన మూడు ద్రవ్య బిల్లులకు మాత్రం ఆమోదం తెలుపలేదు. మూడు ద్రవ్య బిల్లులకు ఆమోదించకుండా అక్టోబరు 19న పంజాబ్ ముఖ్యమంత్రికి గవర్నర్ లేఖ రాశారు. బడ్జెట్ సమావేశాలను పొడిగించడమనేది అక్రమం, చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టేముందు ప్రతిపాదిత చట్టాలన్నింటినీ మెరిట్‌పై పరిశీలిస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 20, 21న రెండు రోజులపాటు జరుగాల్సిన బడ్జెట్ పొడిగింపు సమావేశాలను పంజాబ్ ప్రభుత్వం కుదించింది. గవర్నర్ ఆమోదించని వాటిలో పంజాబ్ ఆర్థిక, బడ్జెట్ నిర్వహణ (సవరణ) బిల్లు 2023, పంజాబ్ వస్తు సేవల పన్ను (సవరణ) బిల్లు 2023, ఇండియన్ స్టాంప్ (పంజాబ్ సవరణ) బిల్లు 2023 బిల్లులు ఉన్నాయి వీటి ఆమోదంపైనే పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే నవంబర్ 1న పురోహిత్ మూడు ద్రవ్య బిల్లులలో రెండింటికి ఆమోదం తెలిపారు. ద్రవ్య బిల్లులు అసెంబ్లీలో ప్రవేశపెట్టాలంటే అందుకు గవర్నర్ ఆమోదం తప్పనిసరి అన్న విషయం తెలిసిందే.

### ఎయిరిండియా ప్రయాణికులకు ఖలిస్థాన్ హెచ్చరికలు...

# తీవ్రంగా పరిగణిస్తున్న భారత్

**నవంబరు 19న సిక్కులు ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించవద్దని హెచ్చరిక**
**ప్రతి చోటా ఎయిరిండియా విమానాలను అడ్డుకుంటామన్న గురుపత్వంత్ సింగ్**
**ఈ హెచ్చరికలు కెనడా దృష్టికి తీసుకెళ్లిన భారత్**



నవంబరు 19వ తేదీన ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించే వారికి ప్రమాదం తప్పదని ఖలిస్థాన్ వేర్పాటు వాది గురుపత్వంత్ సింగ్ (సిఖ్ ఫర్ జస్టిస్ సహ వ్యవస్థాపకుడు) హెచ్చరించడం పట్ల భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. నవంబరు 19న సిక్కులెవరూ ఎయిరిండియా విమానాల్లో ప్రయాణించవద్దని, ఆ రోజున ప్రతి చోటా ఎయిరిండియా విమానాలను అడ్డుకుంటామని గురుపత్వంత్ సింగ్ స్పష్టం చేశాడు. అంతేకాదు, ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు కూడా మూతపడుతుందని, ఆ విమానాశ్రయం పేరు మార్చేస్తామని ఓ వీడియోలో పేర్కొన్నాడు. ఇదంతా ఒకెత్తయితే, నవంబరు 19న అహ్మదాబాద్ లో వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ జరగనుందన్న మాట గురుపత్వంత్ నోటి వెంట రావడం భారత కేంద్ర ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేసింది. వెంటనే ఈ విషయాన్ని కెనడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఎయిరిండియా విమానాలకు భద్రత కల్పించాలని కోరింది. దీనిపై కెనడాలో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ వివరాలు తెలిపారు. కెనడా-భారత్ మధ్య నడిచే ఎయిరిండియా విమానాలకు అదనపు భద్రత కల్పించాలని కెనడా ప్రభుత్వాన్ని కోరామని, సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఇప్పటికే కెనడాలో భారత దౌత్యవేత్తలకు ప్రమాదం పొంచి ఉందన్న నేపథ్యంలో, ఇప్పుడు ఎయిరిండియా విమానాలకు ముప్పు తప్పదని హెచ్చరికలు రావడంతో భారత్-కెనడా మధ్య మరింత అంతరం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కెనడాలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత భారత్-కెనడా మధ్య సంబంధాలు క్షీణించడం తెలిసిందే. ఈ హత్య వెనుక భారత సీక్రెట్ ఏజెంట్ల హస్తం ఉందని కెనడా ఆరోపిస్తోంది

## బీజేపీ చేస్తున్న తీవ్ర ఒత్తిళ్లతో ఈడీ నోటీసులు పంపించింది


**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం తన పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. కాగా ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కేజ్రీవాల్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గతవారం సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందూ. ఈ నేపథ్యంలో సీఎం కేజ్రీవాల్ ఆప్ ఎమ్మెల్యేలతో సమావేశం అవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. లిక్కర్ కేసులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై వివరాలు రాబట్టేందుకు ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అక్టోబర్ 30న నోటీసులు జారీ చేసింది. నవంబర్ 2న విచారణకు హాజరు కావాలని కోరగా.. ఆయన గైర్హాజరయ్యారు. ఈడీ ఆఫీస్‌కు రాకుండా పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌తో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ పాల్గొన్నారు. ఈ మేరకు ఈడీ నోటీసులపై కేజ్రీవాల్ స్పందిస్తూ.. తనకు పంపిన ఈ సమన్లు పూర్తిగా చట్టవిరుద్ధమని ఆరోపించారు. కక్షపూరితం, రాజకీయ ప్రేరేపితమని మండిపడ్డారు. బీజేపీ చేస్తున్న తీవ్ర ఒత్తిళ్లతో ఈడీ నోటీసులు పంపించిందని విమర్శించారు. నోటీసులను ఈడీ వెనక్కి తీసుకోవాలని అన్నారు. మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా నన్ను అడ్డుకునేందుకు ఇప్పుడీ సమన్లు పంపిందని దుయ్యబట్టారు. ఇక ఇదే కేసులో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌లను ఇప్పటికే ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించిన అవినీతి కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ దాదాపు 9 గంటల పాటు ప్రశ్నించింది. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల ముందు విపక్ష 'ఇండియా కూటమి' నాయకులను బీజేపీ లక్ష్యంగా చేసుకుందని, ఈ క్రమంలోనే ముందుగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆప్ నేతలు ఇటీవల కాషాయ పార్టీపై విమర్శలు గుప్పించారు.

## యుద్ధంలో కీలక ఘట్టాన్ని చేరాం



**టెల్ అవీవ్:** కాల్పుల విరమణ చేయాలని కోరుతున్న ప్రపంచ దేశాల విన్నపాన్ని ఇజ్రాయెల్ మరోసారి తోసిపుచ్చింది. ఆదివారం బాంబుల దాడులతో గాజా నగరంపై విరుచుకుపడింది. గాజాను రెండుగా విభజించి హమాస్‌తో జరుగుతున్న యుద్ధంలో కీలక ఘట్టానికి చేరుకున్నట్లు ఇజ్రాయెల్ ఆర్మీ అధికార ప్రతినిధి డేనియల్ హగారి ప్రకటించారు. గాజాను మొత్తం చుట్టుముట్టి, ఉత్తర-దక్షిణ గాజాగా విభజించడంలో విజయం సాధించామని వెల్లడించారు. అటు.. గాజాలో సమాచార వ్యవస్థ నిలిచిపోవడం యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇది మూడోసారి. హమాస్ అంతమే ధ్యేయంగా విరుచుకుపడిన ఇజ్రాయెల్ సేనలు.. ఆదివారం గాజాలో రెండు శరణార్థి శిబిరాలపై దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో దాదాపు 53 మంది మరణించారు. అటు.. హమాస్‌ను అంతం చేసేవరకు వెనక్కి తగ్గబోమని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. తమకు ఇంకో దారి లేదని తెలిపారు. యుద్ధాన్ని ప్రారంభించింది హమాస్ అని గుర్తుచేశారు. మరోవైపు దక్షిణ గాజాలోకి ఇజ్రాయెల్ సేనలు అడుగుపెట్టే అవకాశం ఉందని స్థానిక మీడియా తెలిపింది. ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేస్తున్న క్రమంలో పశ్చిమాసియాలో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ దౌత్య ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. బ్లింకెన్ ఆదివారం వెస్ట్‌బ్యాంక్‌లో పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బాస్‌తో సమావేశమయ్యారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం, గాజాలో పాలస్తీనియన్ల ఇబ్బందులపై చర్చించారు. ఇరాక్‌లోనూ పర్యటన చేపట్టారు. బాగ్దాద్‌లో ఇరాక్ ప్రధాని మహ్మద్ షియా అల్ సుదానీతో భేటీ అయ్యారు. అక్కడి నుంచి నేడు తుర్కియేలో పర్యటించనున్నారు. ఇజ్రాయెల్-హమాస్ మిలిటెంట్ల మధ్య అక్టోబర్ 7న ప్రారంభమైన ఘర్షణ దాదాపు నెల రోజులకు చేరింది. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 9,700 మందికిపైగా మరణించారు. వీరిలో 4,800 మందికిపైగా చిన్నపిల్లలు ఉన్నారు. గాజాపై భూతల దాడుల్లో తమ సైనికులు 29 మంది మృతిచెందారని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. హమాస్ దాడుల్లో ఇప్పటివరకు ఇజ్రాయెల్‌లో 1400 మంది మరణించారు. 280 మంది నిర్బంధంలో ఉ?న్నారు.

## ఢిల్లీలో భారీ భూ ప్రకంపనలు



**ఢిల్లీ:** దేశ రాజధానితో సహా ఉత్తర భారతంలో భారీ భూ ప్రకంపనలు సంభవించాయి. సోమవారం సాయంత్రం 4:18 గంటలకు భూమి ఒక్కసారిగా కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. నేపాల్ కేంద్రంగా రిక్టర్ స్కేలుపై 5.6 తీవ్రతతో భూకంపం సంభవించడంతో ఉత్తర భారతంలో భూమి వణికింది. గత నాలుగు రోజుల్లో వరుసగా మూడో సారి భూమి కంపించింది. ఢిల్లీలో భూమి కంపించడంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇళ్లలో సామాగ్రి కిందపడిపోయిందని స్థానికులు తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టాలు జరగలేదని అధికారులు తెలిపారు.

## పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన 'మొగలి రేకులు' నటుడు

**జనసేన పార్టీలో చేరిన నటుడు సాగర్**
**కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన పవన్ కల్యాణ్**
**సాగర్ రామగుండం జనసేన అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం**



తెలంగాణలో బీజేపీతో పొత్తు పెట్టుకున్న జనసేన పార్టీ కొన్ని స్థానాల్లో పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. బీజేపీ పొత్తు సర్దుబాటులో భాగంగా 9 స్థానాలను జనసేనకు కేటాయించినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మొగలి రేకులు టీవీ సీరియల్ తో ఎంతో గుర్తింపు తెచ్చుకున్న నటుడు సాగర్ జనసేన పార్టీలో చేరారు. ఇవాళ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్... సాగర్ కు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. సాగర్ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం జనసేన అభ్యర్థిగా బరిలో దిగే అవకాశాలున్నాయి. సాగర్ రామగుండం నియోజకవర్గానికి చెందినవాడే. మరి బీజేపీ రామగుండం స్థానాన్ని జనసేనకు కేటాయిస్తుందో, లేదో తెలియాల్సి ఉంది. ఇవాళ సాగర్ మాత్రమే కాదు... హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వ్యాపారి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, కొత్తగూడెం జిల్లాకు చెందిన వ్యాపారవేత్త లక్కినేని సురేందర్ రావు, అదే జిల్లాకు చెందిన ముయ్యబోయిన ఉమాదేవి, ఆమె భర్త నాగబాబు కూడా జనసేనలో చేరారు. జనసేన పార్టీలో చేరిన సందర్భంగా సాగర్ మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ నాయకత్వం, ఆయన ప్రజా పోరాటాలు తనను విశేషంగా ఆకర్షించాయని తెలిపారు. పార్టీలో ఏ బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధితో నెరవేరుస్తానని పేర్కొన్నారు.

## వనజంగి వ్యూపాయింట్ సందర్శకులు ఇక ఫీజు చెల్లించాల్సిందే..!

**అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మేఘాల కొండపైకి ప్రైవేట్ వెహికల్స్ బ్యాన్**
**జీప్ రైడ్ కు తలా రూ.150 నిర్ణయించిన జిల్లా యంత్రాంగం**
**వాహన కాలుష్య నియంత్రణలో భాగంగా నిర్ణయం**




ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం మేఘాల కొండకు వెళ్లే పర్యాటకుల నుంచి ఫీజు వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. సూర్యోదయం అందాలను వీక్షించడానికి ఇప్పటి వరకు వనజంగి వ్యూ పాయింట్ కు స్వంత వాహనాల్లో వెళ్లే వెసులుబాటు ఉండేది. ఇకపై ఘాట్ రోడ్ లో ప్రైవేట్ వెహికల్స్ ను అనుమతించబోమని అధికారులు చెప్పారు. ఘాట్ రోడ్ ఎంట్రీ దగ్గర వాహనాలను పార్క్ చేసి, జీప్ రైడ్ బుక్ చేసుకోవాలని చెప్పారు. పార్కింగ్ కు రూ.50, జీప్ రైడ్ కు తలా రూ.150 చొప్పున ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. పిల్లలకు ఎలాంటి చార్జీ లేదని వివరించారు. ఘాట్ రోడ్ పై డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, డ్రైవర్లు అందరికీ ఆ నైపుణ్యం ఉండదని అధికారులు చెబుతున్నారు. ప్రమాదాల నివారణతో పాటు పొల్యూషన్ నియంత్రణలో భాగంగానే మేఘాల కొండపైకి ప్రైవేట్ వాహనాలను అనుమతించకూడదని నిర్ణయించామన్నారు. ప్లాస్టిక్ బ్యాన్ కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులలో అవగాహన కల్పించడంతో పాటు వ్యూ పాయింట్ వద్ద శుభ్రత కోసం వాలంటీర్లను నియమించినట్లు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఈ వ్యూ పాయింట్ కు తెల్లవారుజామున 3 గంటల నుంచి 5 గంటల వరకు పర్యాటకులను అనుమతిస్తారు. ఇటీవలి కాలంలో పర్యాటకుల రద్దీ పెరగడంతో అధికారులు స్పందించి కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టారు.

# జర్నలిస్టులకు రక్షణ కరువు

ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర వహిస్తుంటారు. నిర్భయంగా, నిష్పక్షపాతంగా వారు ఎక్కడ ఏమి జరుగుతుందో తెలియ చెప్పనిదే నిరంకుశ రాజ్యంగా మారే ప్రమాదం ఉంది. అయితే అనేక వత్తిడుల మధ్య నేడు జర్నలిస్టులు తమ విధులను నిర్వహించాల్సి వస్తున్నది. వారికి రక్షణ కల్పించవలసిన వ్యవస్థలే వారి పట్ల కరకుగా వ్యవహరిస్తున్నాయి. మీడియా సిబ్బందిపై జరిగిన దాడులలో 42 శాతం దాడులను చట్టాన్ని అమలు చేసే సంస్థలే చేశాయని తాజాగా ఐక్యరాజ్య సమితికి చెందిన యునెస్కో విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఈ దాడుల బాధితులలో 28 శాతం మంది జర్నలిస్టులు మహిళలు కావడం గమనార్హం. చివరకు హత్యలకు గురవుతున్న జర్నలిస్టుల కేసుల విషయంలో కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గత మూడు దశాబ్దాలుగా జర్నలిజం ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన వృత్తులలో ఒకటిగా మారుతుందని ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. తమ పనిని నిర్వహించే క్రమంలో 1600 మంది జర్నలిస్టులు మరణించారని యునెస్కో నివేదిక తెలుపుతున్నది. యునెస్కో అంచనాల ప్రకారం కేవలం పదికి ఒక కేసులో మాత్రమే ఈ నేరాలకు బాధ్యులు చట్టం ముందు విచారణను ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయ చట్టం, ఇతర ఒప్పందాల ప్రకారం జర్నలిస్టులకు వ్యతిరేకంగా జరిగే నేరాలను పూర్తిగా విచారించి బాధ్యులను గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకోవడంలో దేశాలు భయంకరమైన వైఫల్యాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అంతర్జాతీయ చట్టం ప్రకారం జర్నలిస్టులపై జరిగిన దాడులపై తక్షణమే, పూర్తిగా, స్వతంత్రంగా దర్యాప్తు చేయడం, బాధ్యులను విచారించడం ప్రభుత్వాల బాధ్యత. పలు అంతర్జాతీయ, ప్రాంతీయ మానవ హక్కుల సాధనాలు, అలాగే అనేక ఐక్యరాజ్య సమితి ప్రోటోకాల్స్, తీర్మానాలు జాతీయ ప్రభుత్వాలపై గల ఇటువంటి బాధ్యతలను స్పష్టం చేస్తున్నాయి. మానవ హక్కుల ఉల్లంఘనలకు ప్రభుత్వాలు సమర్థవంతమైన పరిష్కారాన్ని అందించాలని కోరుతున్నాయి. గత నవంబర్ 2022లో ఐక్యరాజ్య సమితి సభ్య దేశాల ప్రతినిధులు వియన్నాలో సమావేశమై జర్నలిస్టుల భద్రతను కాపాడేందుకు తమ కట్టుబాట్లను బహిరంగంగా పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులపై జరుగుతున్న నేరాలకు శిక్షలు లేకుండా ఉండే పరిస్థితులను పరిష్కరించడానికి కఠినమైన చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. జర్నలిస్టుల భద్రత, శిక్షార్హత సమస్యపై ఐక్యరాజ్య సమితి కార్యాచరణ ప్రణాళిక 10 సంవత్సరాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సమావేశం జరిగింది. అయినా పరిస్థితులలో పెద్దగా మార్పు కనిపించడం లేదు. ప్రస్తుతం గాజా, ఉక్రెయిన్, హైతీ, ఇథియోపియా, సహేల్, యెమెన్‌లతో సహా ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో ఘర్షణలు, సాయుధ తిరుగుబాట్లు చెలరేగుతున్నందున జర్నలిస్టుల విధి నిర్వహణ పెను సవాళ్ళతో కూడుకొంటున్నది. వారిపై జరిగే నేరాలను పరిశోధించే ప్రభుత్వ బాధ్యత ఇటువంటి ప్రాంతాలలో అదృశ్యం అవుతున్నది. సాయుధ సంఘర్షణ పరిస్థితులలో జర్నలిస్టులు, మీడియా ఉద్యోగుల భద్రతను కాపాడేందుకు అంతర్జాతీయ చట్టం, అంతర్జాతీయ మానవతా చట్టం ప్రకారం చట్టబద్ధంగా ప్రభుత్వాలు వ్యవహరించాల్సి ఉంది. సాయుధ సంఘర్షణ సమయంలో జర్నలిస్టుపై ఉద్దేశపూర్వకంగా దాడి చేయడం యుద్ధ నేరంగా పరిగణించి దర్యాప్తు జరపాల్సి వున్నప్పటికీ ఆ విధంగా జరగడం లేదు. తాజాగా కమిటీ టు జర్నలిస్ట్స్ (సిపిజె) విడుదల చేసిన నివేదిక ప్రకారం గత దశాబ్ద కాలంలో 263 జర్నలిస్టులకు సంబంధించిన హత్యలలో 80 శాతం కేసులలో న్యాయం జరగనే లేదు. అంటే వారి హత్యలకు బాధ్యులైన వారిని చట్టం ముందు దోషులుగా తేల్చే ప్రయత్నం జరగలేదు. 'జర్నలిస్టు హత్యలకు సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యం, నిరంకుశ వ్యవస్థలు గల దేశాలలో దాదాపు 80 శాతం కేసులలో శిక్షలు విధించకపోవడంలో సందేశం స్పష్టంగా ఉంది. జర్నలిస్టులు రాజకీయ క్రీడలకు బలవుతున్నారు' అని సిపిజె అధ్యక్షుడు జోడీ గిన్స్‌బర్గ్ ఆవేదన వ్యక్తం చేశారు. హత్య అనేది సెన్సార్ షిప్‌కు అంతిమ రూపం. వేగవంతమైన, పారదర్శకమైన, స్వతంత్ర స్థానిక దర్యాప్తులు కీలకమైనవి. రాజకీయ సంకల్పం ఉంటే గాని తమ వృత్తిపరమైన విధులు నిర్వహిస్తున్న సమయంలో హత్యకు గురవుతున్న జర్నలిస్టుల కేసులలో విస్తృతమైన శిక్షార్హతను నిరోధిస్తున్న న్యాయ మార్గాన్ని మార్చగలదు' అని తెలిపారు. చివరకు ఎన్నికల సమయంలో నిర్భయంగా వార్తా కథనాలు ప్రచురించకుండా నిరోధించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రపంచ దేశాల్లో ఎన్నికల సమయంలో పాత్రికేయులపై జరుగుతున్న దాడులకు సంబంధించి యునెస్కో రూపొందించిన నివేదిక ప్రకారం 2019 నుండి 2022 జూన్ వరకూ 70 దేశాల్లో 89 దాడులు జరిగాయి. ఎన్నికల సందర్భంగా అనేక మంది పాత్రికేయులను నిర్బంధించడం జరుగుతుంది.అయితే కొందరిని తాత్కాలికంగా అరెస్ట్ చేయడం, మరి కొందరిపై మోపిన ఆరోపణల్ని ఆ తర్వాత వెనక్కి తీసుకోవడం జరుగుతున్నది.నిరసన ప్రదర్శనలకు సంబంధించిన వార్తలను అందించే సమయంలో చాలా మంది పాత్రికేయులు అరెస్ట్‌లకు గురవుతున్నారు. నవంబర్ 2న 'జర్నలిస్టులకు వ్యతిరేకంగా జరిగిన నేరాలకు శిక్షార్హత లేని అంతర్జాతీయ దినోత్సవం' సందర్భంగా సిపిజె విడుదల చేసిన 'శిక్షలు లేని సూచిక' ఇటువంటి ధోరణులు ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్నట్లు వెల్లడి చేస్తుంది. సోమాలియా, ఇరాక్, మెక్సికో, ఫిలిప్పీన్స్, పాకిస్తాన్, భారత దేశంలలో ఈ సూచిక ప్రారంభించిన 2008 నుండి ప్రతి ఏడాది ఇటువంటి సంఘటనలు జరుగుతూ ఉండటం గమనార్హం. సిరియా, దక్షిణ సూడాన్, అఫ్ఘనిస్తాన్, బ్రెజిల్ లలో కూడా నిరంతర ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయి. నిర్భయంగా వార్తాకథనాలు రాసిన పాత్రికేయుల పట్ల ప్రతీకారంతో వ్యవహరిస్తూ హత్యలకు గురైన వారి కేసుల విషయంలో న్యాయబద్ధంగా వ్యవహరించడం లేదని ఈ సూచిక స్పష్టం చేస్తుంది. సిపిజె దృష్టికి వచ్చిన పాత్రికేయుల హత్యలకు సంబంధించిన ఘటనలలో 1992 నుండి నేరస్థులను దోషులుగా నిర్ధారించబడటం కేవలం 47 మంది జర్నలిస్టుల విషయంలోనే జరిగిన్నట్లు కనుగొన్నారు. అంటే వారి దృష్టికి వచ్చిన కేసులలో 5 శాతం కన్నా తక్కువ కేసులలోనే నేర విచారణ క్రమబద్ధంగా జరుగుతున్నట్లు తేలుతుంది. ఆయా దేశాల అంతర్గత రాజకీయాలు, అంతర్జాతీయ ఒత్తిడిలో మార్పులు జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో సహాయపడతాయని సిపిజె భావిస్తున్నది. 1988లో హత్యకు గురైన పెరువియన్ జర్నలిస్ట్ హ్యూగో బుస్టియోస్ సావేద్రా విషయంలో ఇదే జరిగింది. పెరూ మాజీ ఆర్మీ ఇంటెలిజెన్స్ చీఫ్‌కు అతని హత్యకు పాల్పడినందుకు శిక్ష పడేందుకు దాదాపు 35 ఏళ్లు పట్టింది. జెనీవాకు చెందిన ది ప్రెస్ ఎంబ్లమ్ క్యాంపెయిన్ (పిఇసి) ఇజ్రాయెల్ -హమాస్ మధ్య జరుగుతున్న ఘర్షణలో చాలా మంది జర్నలిస్టులు మృతి చెందడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని యుద్ధ నేరాలుగా పరిగణించి స్వతంత్ర దర్యాప్తులు జరిపేందుకు ఐక్యరాజ్యసమితి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సంస్థ పిలుపిచ్చింది. 2023 ప్రారంభం నుండి ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 74 మంది జర్నలిస్టులు దాడులు, బాంబు దాడులు లేదా లక్ష్యంగా చేసుకున్న హత్యలలో మరణించారని తెలిపింది. ఈ సంవత్సరం అక్టోబరులో 36 మంది జర్నలిస్టులు మరణించారు. వారిలో 33 మంది ఇజ్రాయెల్, -హమాస్ (గాజాలో 28 పాలస్తీనియన్లు, 4 ఇజ్రాయెలీలు, 1 లెబనాన్‌లో) ఘర్షణలో మరణించిన వారి. 'ఇవి స్పష్టంగా యుద్ధ నేరాలు. జన సాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో దాడులు జరుగుతున్నందున మీడియాపై అసాధారణమైన దాడిగా పరిగణించాల్సిందే' అని పిఇసి అధ్యక్షుడు బ్లేజ్ లెంపెన్ స్పష్టం చేశారు.

# పరిశోధనలో దిట్ట సివి రామన్




విజ్ఞాన ఆవిష్కరణల్లో భారతీయులకు నోబెల్ రావడం గగన సదృశం. సర్ సివి రామన్ ఆ ఘనత సాధించారు. అంతేకాదు, విజ్ఞాన శాస్త్రంలో ఆఘనత సాధించిన ఏకైక ఆసియా వాసిగానూ ఖ్యాతి గడించారు. సైన్సులో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేసి చూపించి, విశ్వ వినువీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెప లాడించిన మహా జ్ఞాని చంద్రశేఖర్ వెంకటరామన్ (సి వి రామన్). వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్‌ను శక్తివంతంగా చూపి, అబ్బుర పరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారు సర్ సివి రామన్. వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ అందుకున్న విజ్ఞాన ఖని. ఒక్క మాటలో చెప్పాలంటే వైజ్ఞానిక శాస్త్రానికే వైద్యుడిలా మారిన మహోన్నతుడు. ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేసిన వ్యక్తుల్లో సర్ సీవి రామన్ మొదటివారు. సీవీ రామన్ నవంబర్ 7, 1888 తమిళనాడులోని తిరుచురాపల్లిలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. తండ్రి విశాఖపట్నంలోని ఏవీఎన్ కళాశాలలో లెక్చరర్ గా పని చేయడం వల్ల రామన్ బాల్యం, విద్యాభ్యాసం అక్కడే జరిగింది. అనంతరం మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరి 19 ఏళ్లకు ఫిజిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాస్కై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా చేరారు. ఆ సమయం లోనే పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్నారు.

పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లడమేమిటి?. విదేశీయులే.. పరిశోధనల కోసం ఇక్కడకు రావాలని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి రామన్. రామన్ ముందు వరకూ సైన్స్‌లో నోబెల్ బహుమతులు పాశ్చాత్యులకే దక్కేవి. కానీ, రామన్ అచ్చమైన భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, తలమానికమైన పరిశోధన జరిపి సైన్సులో దేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారు. 'నా మతం సైన్సు.. దానినే జీవితాంతం ఆరాధిస్తా..' అని చెప్పి తుదిశ్వాస వరకూ శాస్త్రాన్వేషణ లోనే గడిపిన దార్శనికుడు. "విజ్ఞాన శాస్త్ర సారాంశం, ప్రయోగ శాలల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశోధన, స్వతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి ఇవే విజ్ఞాన శాస్త్ర సాగరాన్ని మథించి వేస్తాయి" అంటూ ఆయన చేసిన ప్రసంగం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనబడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తూ ఉంటే స్ఫటిక నిర్మాణం గురించిన ఆలోచనలు వస్తుంటాయి. అందుకే "విజ్ఞానం అత్యుత్తమైన సృజనాత్మక కళారూపం అని రామన్ ఎప్పుడూ చెబుతుండే వారు.

మెర్క్యూరీ ల్యాంప్ నుండి ఏకవర్ణ కాంతి తరంగాలను ఒక పారదర్శక యానకం గుండా ప్రసరింపజేస్తే, యానక ధర్మాలపై ఆధారపడి ఆ కాంతిలో కొంత భాగం వివర్తనం చెంది, తక్కువ తరంగ దైర్ఘ్యం గల కాంతిగా బహిర్గత మౌతుంది. సముద్ర జలంపై ఇదే ప్రక్రియతో నీలి రంగు కాంతి బహిర్గతమవుతుంది. దీనినే 'రామన్ ఫలితం' (రామన్ ఎఫెక్ట్) అంటారు. రామన్ జీవితంలో మరో మైలురాయి రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతం. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని, దాని వల్లనే అది తన గమనాన్ని మార్చుకుంటుందని తన సిద్ధాంతాల ద్వారా రుజువు చేశారు రామన్. అప్పటికున్న అరకొర సదుపాయాలతోనే మన దేశ విజ్ఞాన కిరణాలను నలుదిశలా ప్రసరింప జేశారు. సూర్యుని నుంచి వెలువడే తెలుపు వర్ణపు కాంతి వాయువులోని అణువులపై పడి, వాటి ప్రయాణ దిశను మార్చు కుంటాయని తన పరిశోధనల ద్వారా తెలుసుకున్న సి.వి. రామన్ ఓ సిద్ధాంతాన్ని సూత్రీకరించాడు. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని 1928 సంవత్సరం, ఫిబ్రవరి 28న రామన్ మొట్ట మొదటిసారి ప్రకటించారు.

పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింప చేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చు కుంటుంది. ఈ విషయాన్ని 1928 మార్చి 16 న బెంగుళూరులో జరిగిన శాస్త్రజ్ఞుల సదస్సులో చూపించాడు. అతను అనుకున్నట్లే 1928 ఫిబ్రవరి 28 న "రామన్ ఎఫెక్టు" ఆవిష్కరించడం జరిగింది. ఈ పరిశోధనను అభినందిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం 1929 లో "నైట్ హుడ్" బిరుదుతో సత్కరించింది. ఈ రామన్ ఎఫెక్టు అసామాన్య మైనదని, అందులో 200 రూపాయలు కూడా ధర చేయని పరికరాలతో ఆ విషయ నిరూపణ జరగడం అద్భుతమైనదని ప్రపంచ శాస్త్రజ్ఞులంతా రామన్ ను అభినందించారు.అఖండ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన రామన్ కు ఎన్నో గౌరవ డాక్టరేట్లు లభించాయి. 1924 లో ఇంగ్లండ్ "రాయల్ సొసైటీ" సభ్యుడయ్యాడు. 1928 లో రామన్ కు "సర్" బిరుదు దక్కింది. 1947 లో ప్రతిష్ఠాత్మకమైన "ఫ్రాంక్లిన్ మెడల్" లభించింది. తన అనన్య సామాన్య పరిశోధనా సామర్థ్యంతో ఫిజిక్స్ రంగంలో రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28 నే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపు కొంటున్నాం.

1987 ఫిబ్రవరి నుండి ప్రతీ సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవంగా భారత ప్రభుత్వం అధికారకంగా జరుపుతోంది. రామన్ నూటికి నూరుపాళ్ళూ భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, పరిశోధనలు జరిపి సైన్సులో శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారాయన. 1913 లో సాహిత్యంలో మనదేశం నుండి నోబెల్ బహుమతి పొందిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అనంతరం సైన్సు రంగంలో విజయ ఢంకా మ్రోగించిన అఖండ ప్రజ్ఞాశాలి రామన్ ఒక్కరే కావడం దేశానికి గర్వకారణం. రామన్ పరిశోధనలు సైన్సులో, పారిశ్రామిక రంగంలోనూ క్రొత్తపుంతలు త్రొక్కడానికి దారితీసింది. శాస్త్ర రంగంలో రామన్ స్పెక్ట్రోస్కోపీ ఆవిర్భావానికి "భారతరత్న", 1957 లో "లెనిన్ శాంతి బహుమతి" లభించాయి. కాంతి ప్రసరణపై జరిపిన పరిశోధనలకు "నోబెల్ బహుమతి" లభించింది. స్వాతంత్ర్యం రాగానే రామన్ కు మొట్టమొదటి నేషనల్ ప్రొఫెసర్ గా ప్రభుత్వం నియమించి గౌరవించింది. 1948 లో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ గా రిటైరయ్యారు. దృష్టి, కాంతి, ధ్వని, వర్ణాలు, ద్రవాల తలతన్యత, ఖనిజాలు, డైమండ్, క్రిస్టల్ తదితర అంశాలపై పరిశోధనలు జరిపిన సి.వి. రామన్ సుమారు 465 పరిశోధన పత్రాలను వెలువరించాడు. వాటిని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగుళూరు వారు సేకరించి భద్రపరిచారు. 1949 లో బెంగుళూరులో రామన్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ స్థాపించి, 1970 నవంబరు 27 న ఆయన మరణించే వరకూ, ఆ సంస్థలో పరిశోధనలు జరిపి, మన దేశంలో సైన్సు అభివృద్ధికి మార్గదర్శకు లయ్యారు. 1971 నవంబర్ 21 న సీ.వీ. రామన్ పోస్టేజి స్టాంపును భారత ప్రభుత్వం వెలువరించి ఆ మహా శాస్త్రజ్ఞుడిని గౌరవించింది.

# రాజకీయ అనుభవశాలి



గోగినేని రంగనాయకులు... ఈ పేరు అంతగా ప్రాచుర్యం లేనిది. ఈ పేరు చెపితే దేశంలో గుర్తు పట్టే వారు దాదాపు ఉండక పోవచ్చు. ఆయన ఒక నిబద్ధత కలిగిన పాతతరం రాజకీయ నాయకులు. ఆయనను భారత రైతాంగ ఉద్యమపితగా భావిస్తారు. సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన ప్రజాప్రతినిధి. లోక్‌సభలోనూ, ఇటు రాజ్యసభలోనూ 60 ఏళ్ళు రైతుల పక్షాన పోరాడిన నాయకులు. రాజకీయ అవగాహన కలిగిన వారికి ఇప్పుడు ఆయనెవరో స్ఫురణకు వచ్చి ఉంటుంది. రైతాంగ విధానాలకు మద్దతు నిచ్చిన ఆయనే సుధీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న ఆచార్య ఎన్.జి.రంగా. ఆచార్య రంగా (నవంబరు 7, 1900 – జూన్ 9, 1995) భారత స్వాతంత్ర్య సమర యోధులు, పార్లమెంటు సభ్యులు, రైతు నాయకుడు. 1935లో తొలిసారి కేంద్ర శాసనసభకు సభ్యులై అప్పటి నుంచి మరణించే వరకు నిరంతరం పార్లమెంటేరియన్ గానే కొనసాగారు. రంగా, 1900, నవంబరు 7 న గుంటూరు జిల్లా నిడుబ్రోలులో గోగినేని నాగయ్య, అచ్చమాంబ దంపతులకు జన్మించారు. నిడుబ్రోలులో ప్రాథమిక విద్యను ముగించుకొని, గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కళాశాల నుండి పట్టభద్రు లైనారు. 1924లో భారతీ దేవితో రంగా వివాహం జరిగింది.

1926 లో ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం నుండి ఆర్థ శాస్త్రములో బి.లిట్ పొంది భారత దేశానికి తిరిగి వచ్చిన తర్వాత మద్రాసు లోని పచ్చయప్ప కళాశాలలో ఆర్థిక శాస్త్ర ఆచార్యునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన ప్రధానంగా హేతువాది. 1930లో మహాత్మా గాంధీ పిలుపుకు స్పందించి రంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1933లో రైతు కూలీ ఉద్యమానికి నేతృత్వం వహించారు. కిసాన్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. రైతుకూలీల పరిస్థితిపై గాంధీతో చారిత్రాత్మక చర్చలు జరిపారు. ఈ చర్చలలోని ముఖ్యాంశాలపై "బాపు దీవెనలు" అన్న పేరుతో రంగా ఒక పుస్తకాన్ని వెలువరించారు.ఆంధ్రలో తొలిసారి రాజకీయ పాఠశాలలను ప్రారంభించిన ఖ్యాతి రంగాదే. నిడుబ్రోలులో రామనీడు పేరుతో రాజకీయ పాఠశాలను ఏర్పాటు చేసారు.1933వ సం.లో రంగా స్థాపించిన రాజకీయ విద్యాలయాన్ని మహాత్మాగాంధీ ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రులు నారా చంద్రబాబు నాయుడు , కొణిజేటి రోశయ్య కూడా రంగా శిష్యులే. ఆ పాఠశాల గత మధుర స్మృతులకు సజీవ సాక్ష్యంగా నేటికి నిడుబ్రోలులో కొనసాగుతుంది. తొలి రాజకీయ పాఠశాలలో పుచ్చలపల్లి సుందరయ్యతో సహా కొందరు కమ్యూనిసులూ పాల్గొన్నారు. రంగా ఆంగ్లంలోను, తెలుగులోను మంచి రచయిత. 'హరిజన నాయకుడు' అనే నవల కూడా రాశారు. ఆంధ్ర రాజకీయాలలో గాంధీ అనుచరుడిగా పట్టాభి సీతారామయ్య ఉండగా, రంగా గాంధీకి సన్నిహితుడు కాలేక పోయారు. అయినా పార్టీ సిద్ధాంత పరంగా గాంధేయుని గానే కొనసాగారు. సుభాస్ చంద్రబోస్ అంటే ఇష్టపడేవారు.1937 నుంచి వాహిని అనే పత్రికను నడిపారు.

1938 నాటికే ఇందూలాల్ యాగ్నిక్‌తో కలిసి కిసాన్ సభలు నిర్వహించారు. ప్రకాశం పంతులుతో కలిసి ఆంధ్ర రాజకీయాలలో కీలక పాత్ర వహించిన రంగాకు చాలా మంది శిష్యులు ఉండేవారు.గౌతు లచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కందుల ఓబుల రెడ్డి, చేగిరెడ్డి బాలిరెడ్డి, ఎన్.వి. నాయుడు, నీరుకొండ రామారావు, బీశెట్టి అప్పారావు, పి.రాజగోపాల నాయుడు ఇత్యాదులు ఎందరో రంగా పిలుపు నందుకొని రాజకీయాలలో ప్రవేశించారు. స్వాతంత్ర్య పోరాటంలో నిర్విరామంగా పాల్గొన్న రంగా అనేక పర్యాయాలు జైలు పాలయ్యారు. జైళ్ళలోకూడా రాజకీయ ఖైదీలకు పాఠశాలలు నిర్వహించారు. ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. మద్రాసు లోని పచ్చయప్పాస్ కళాశాలలో ఆర్థిక శాస్త్రాచార్యుడిగా చేరి నాలుగేళ్ళ పాటు ఉన్నప్పుడు రంగాకు విద్యార్థిగా అన్నాదొరై తమిళనాడు ముఖ్యమంత్రి) ఉండేవారు. రంగా, అంతర్జాతీయ వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య వ్యవస్థాపకులలో ఒకరు. 1946లో కోపెన్ హేగెన్‌లో జరిగిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ సదస్సులో, 1948లో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన అంతర్జాతీయ శ్రామిక సంస్థ సదస్సులోనూ, 1952లో ఒట్టావాలో జరిగిన అంతర్జాతీయ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులోను, 1954లో న్యూయార్కులో జరిగిన ఇంటర్నెషనల్ పెజెంట్ యూనియన్, 1955లో టోక్యోలో జరిగిన ఆసియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంటు లోను భారత దేశం తరపున ప్రతినిధిగా పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం తొలి ఎన్నికలు వచ్చేనాటికి ముఠా తగాదాల కారణంగా రంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి కృషీకార్ లోక్ పార్టీ స్థాపించారు. ఆ ఎన్నికలలో చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో మాత్రమే కృషీకార్ లోక్ పార్టీ అభ్యర్థులు గెలిచారు. తరువాత సహకార రంగ వ్యవసాయానికి బద్ధ వ్యతిరేకి అయిన రాజాజీతో కలిసి స్వతంత్ర పార్టీని స్థాపించారు. రంగా స్వతంత్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులై ఒక దశాబ్దం పాటు నిర్వహించారు. 1962 సార్వత్రిక ఎన్నికలలో పార్టీ 25 స్థానాలలో గెలిచి బలమైన ప్రతి పక్షముగా రూపుదిద్దు కొన్నది. 1972లో రంగా తిరిగి కాంగ్రెస్ (ఐ)లో చేరి, ఇందిరా గాంధీ కి సన్నిహితులై చివరి వరకూ కాంగ్రెస్ లోనే కొనసాగారు. నెహ్రూ నాయకత్వాన్ని, ఆయన ప్రతిపాదించిన సహకార వ్యవసాయాన్ని కాదని దేశ వ్యాప్తంగా స్వతంత్ర పార్టీ ఏర్పడగా, దానికి తొలి అధ్యక్షులుగా ఆచార్య రంగా ఉన్నారు. రాజగోపాలా చారి, మినూ మసానీ, పీలూ మోడీ, రత్నస్వామి, బెజవాడ రామచంద్రా రెడ్డి మొదలైనవారు ఎందరో రంగాతో చేతులు కలిపారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పడిన పార్టీలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి కూడా తొలిదశలో ఉన్నారు. క్రమేణా స్వతంత్ర పార్టీకి రంగా దూరం అవుతూ వచ్చారు. జాతీయ నాయకులలో అంబేద్కర్‌తో రంగా సన్నిహితంగా ఉండేవారు. రాజ్యాంగ సభకు అంబేద్కర్ పేరును ప్రతిపాదించడంలో ఆయన కీలకపాత్ర వహించారు. ఆంధ్రలో సంస్కరణ వివాహాలను రంగా ప్రోత్సహించారు. 1952 నుండి 62 వరకు తెనాలి, 62 నుండి 67 వరకు చిత్తూరు, 67 నుండి 70 వరకు శ్రీకాకుళం, 80 నుండి 84, 84 నుండి 89 వరకు, 89 నుండి 91వరకు మూడుసార్లు వరుసగా గుంటూరు లోకసభ నియోజకవర్గ స్థానాలకు ప్రాతినిథ్యం వహించారు. 1946లో కోపెన్ హేగన్‌లో జరిగిన వ్యవసాయ సమాఖ్యలో పాల్గొన్నారు. 1952లో కామన్వెల్త్ పార్లమెంటరీ సమావేశంలో పాల్గొని అటావా నగరంలో ప్రసంగించారు. 1954లో న్యూయార్క్‌లో జరిగిన అంతర్జాతీయ రైతు సమాఖ్యలో ప్రధానోపన్యాసం చేశారు. 1955లో టోక్యోలో జరిగిన 'ఏషియన్ కాంగ్రెస్ ఫర్ వరల్డ్ గవర్నమెంట్' సభలో సుదీర్ఘోపన్యాసం చేశారు. రైతు సమస్యల్ని అంతర్జాతీయ సభ ల దృష్టికి తీసుకువచ్చారు. పొగాకు, పత్తి రైతుల, చేనేత కార్మికుల సమస్యలకు అధిక సమయాన్ని వినియోగించారు. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ పుంఖాను పుంఖంగా రచనలు చేశారు. రైతులు విప్లవోద్యమాలలో నిర్వహించిన పాత్రను అధ్యయనం చేసి రివల్యూషనరీ పెజంట్స్, ది క్రెడో ఆఫ్ వరల్డ్ పెజంట్స్ అనే గ్రంథాలు రాశారు. రంగా సుదీర్ఘ కాలం పార్లమెంట్ సభ్యునిగా రికార్డు సృష్టించి, గిన్నీస్ బుక్‌లోకి ఎక్కారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎలాంటి పదవులు లేకుండా ప్రతిష్ఠాత్మకమైన నీతివంతమైన రాజకీయాన్ని పాటించి,95 సంవత్సరాల వయస్సులో ఆయన అనారోగ్యంతో 1995 జూన్ 8వ తేదీన నిడుబ్రోలులోని ఆయన స్వగృహమైన గోభూమిలో తుది శ్వాస విడిచారు.

## నాడు రైతులకు ఇతోధిక సాయం



నేడు ఆఊసే లేని వైనం

**రాయదుర్గం నవంబర్ 6 (జనసూర్యశ్రీ) :** తెలుగుదేశం పాలనలో ప్రతి అడుగులో రైతుకు సాయమందించామని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50వారాల సెల్ఫీ ఛాలెంజిలో భాగంగా రాయదుర్గం మండలం, ఆవులదట్ల గ్రామంలో టిడిపి హయాంలో రైతులకు ఉచితంగా ఇచ్చిన మోటారు వద్ద సోమవారం ఆయన 30వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. చంద్రబాబు ప్రభుత్వం రైతులను ఆదుకోవాలనే సదుద్దేశంతో ఉచితంగా మోటార్లతో పాటు ప్యానల్ బోర్డ్, పంపులను అంధించిందన్నారు. లబ్ధిదారుల వాటా లేకుండా పూర్తిగా ఉచితంగా నాణ్యమైన మోటార్లను పంపిణీ చేశామన్నారు. అప్పట్లోనే అత్యాధునిక టెక్నాలజీతో మోటార్లను ఫోన్ ద్వారా నడుపుకునే వెసులుబాటు కల్పించామన్నరు. ఈ టెక్నాలజీ ద్వారా రైతులు రాత్రి పూట విద్యుత్ షాక్ కు, పాము కాటుకు గురికాకుండా నిరోధించామన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో దాదాపుగా 450 మందిపైగా రైతులకు ఉచితంగా మోటార్లు పంపిణీ చేశామన్నారు. సి.ఎం. జగన్ రైతు పక్షపాతి అని డబ్బాలు కొడుతున్న ఏమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి జలకళ పథకం ద్వారా ఎంతమంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించారో చెప్పాలని కాలవ నిలదీశారు. వైసిపి ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఒక వైపు రైతులకు కరెంటు కనెక్షన్లు ఇవ్వడం లేదని, మరోవైపు నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేయడం లేదన్నారు. రైతులకు సంబంధించిన అనేక సబ్సిడీ పథకాలను రద్దు చేసిన జగన్మోహన్ రెడ్డి రైతు ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతాడని మండిపడ్డారు. రైతాంగాన్ని బతికించాలని అనేక సంక్షేమ పథకాలను తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తే, వైసిపి రైతులను గాలికొదిలేసిదని కాలవ ఆరోపించారు.

## పెడపల్లి లో పురందేశ్వరికి ఘన స్వాగతం.



**పుట్టపర్తి రూరల్, నవంబర్ 6, (జనసూర్య శ్రీ) :** రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురుందేశ్వరికి పెడపల్లి లో బిజెపి నాయకులు, సోమవారం ఘనంగా స్వాగతం పలికారు, పుట్టపర్తిలో ఏర్పాటుచేసిన పార్టీ సంస్థాగత సమావేశానికి హాజరవుతున్న నేపథ్యంలో అధ్యక్షురాలు బెంగళూరు విమానాశ్రయం నుండి నేరుగా పెడపల్లికి చేరుకున్నారు. పెడపల్లి గ్రామంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు జిఎం శేఖర్ గుడిసె దేవానంద్, వజ్ర భాస్కర్ రెడ్డి, బూదిలి సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టపర్తి కొండమ రాజు, పట్టణ అధ్యక్షుడు బాలగంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి రాజారెడ్డి, డాక్టర్ రాఘవేంద్ర, భాస్కర్ రెడ్డి, ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ రాఘవేంద్ర నివాసంలో అల్పాహారం విందు చేశారు. ఈ సందర్భంగా పెడపల్లి కార్యకర్తలతో నాయకులతో ఆమె ముఖాముఖి మాట్లాడారు. పలువురు మహిళలను ఆప్యాయంగా పలకరించారు.

## కార్యకర్తలే కేపిఆర్ లై హెూరెత్తిస్తున్న ప్రచారం

బిజెపి గుండాల్లార్ ఖబర్దార్



**దుబ్బాక నవంబర్ 6,(జనసూర్యశ్రీ). :** కత్తిపోటుకు గురై చికిత్స పొందుతున్న దుబ్బాక బిఎస్ఆర్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపుకు కార్యకర్తలే అండగా నిలబడి ఆయన ప్రచారాన్ని కార్యకర్తలు భుజస్కందాలపై వే సుకుని ఆయన గెలుపు కోసం హర్నిశలు కృషి చేస్తు ప్రచారం బిఎస్ ఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ .పండు,నరేష్ తోపాటు మరికోంతమంది కార్యకర్తలు హెూరెత్తిస్తున్నారు . దుబ్బాక పట్టణంలోని సోమవారం 14 వ వార్డులో కే పి ఆర్ ప్రచారంలో లేకున్నా కార్యకర్తలే ప్రచార బాధ్యతలు తీసుకొని బీఎస్ ఆర్ పార్టీ కారు గుర్తు ప్రచారం స్పీడ్ పెంచారు. బిజెపి పార్టీ చేస్తున్నటువంటి విమర్శలను తిప్పుకొట్టారు. రచ్చ పేటలో బిజెపి పార్టీ నేత రఘునందన బి ఎస్ ఆర్ పార్టీ నాయకులను గుండాలన్నారు ఒక ప్రజాప్రతినిధులు అయ్యుండి వేరొక పార్టీ ప్రజాప్రతిని గుండాలనడాన్ని తీవ్రంగా ఖండించారు. దుబ్బాక మున్సిపాలిటీ, నియోజకవర్గం, ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి. నీది నోరా లేక మున్సిపాలిటీ కంప ఇచ్చిన హామీలను నెరవేర్చలేక మయామాటలు చేపట్టి ప్రజలను మోసంచేస్తూన్నారు.నీ మయామాటాలు ప్రజలు నమ్మెరోజులు పోయాయి. పిచ్చిపిచ్చిగా మాట్లాడి ఉన్న హిజిత్ పోగొట్టుకోవద్దు. ఎన్నికల్లో బిఎస్సార్ పార్టీ గెలవడం ఖాయం.

## బిఆర్ఎస్ పార్టీకి ఎదురుదెబ్బ

## బిఆర్ఎస్ కు తెలంగాణ ఉద్యమకారులు టా టా



**పెద్దపల్లి నవంబర్ 6 (జనసూర్యశ్రీ) :**పట్టణ కేంద్రంలోని విజయరమణా రావునివాసంలో పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని 27 వ వార్డ్ కి చెందిన తెలంగాణ ఉద్యమకారులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పునుకొండ వైకుంఠం, తెలంగాణ ఉద్యమకారుల ముగ్గురు పునుకొండ రాకేష్,గుంత సంతోష్,సంగెం శిరిష్,లతో పాటు కస్తూరి రాజు, రాంపెల్లి సురేందర్, ఎండి. జంగిర్, ఎండి రాజీ, ఎండి . ఆషమ్ పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణా రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికి ఈ నెల 30 న జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# అది సామాజిక బస్సు యాత్ర కాదు.. భజన యాత్ర

పదవులు కాదు.. మీ కులాలకు ఏం చేశారో చెప్పండి

టీడీపీ కమ్మల పార్టీ కాదు కేతిరెడ్డి.. మీరు పెట్టిన కేసులు చూసుకోండి

ఎస్సీ, ఎస్టీ, బీసీలను తొక్కుతూ ఎదుగుతున్నావ్

కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం మానుకో

యూట్యూబ్ లలో వీడియోల మీద ఉన్న శ్రద్ధ ప్రజలపై పెట్టు

ఎమ్మెల్యే కేతిరెడ్డికి పరిటాల శ్రీరామ్ స్ట్రాంగ్ కౌంటర్



**ధర్మవరం నవంబర్ 6 (జనసూర్యశ్రీ) :** వైసీపీ నాయకులు ధర్మవరంలో చేసింది సామాజిక సాధికార బస్సు యాత్ర కాదని.. అది జగన్ భజన యాత్ర అని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ కామెంట్ చేశారు. ధర్మవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ బస్సుయాత్రతో పాటు ఎమ్మెల్యే కేతిరెడ్డి చేసిన వ్యాఖ్యల మీద ఘాటుగా స్పందించారు. బస్సు యాత్రలో పాల్గొన్న వారంతా తమకు ఇన్ని పదవులు ఇచ్చారు.. అన్ని ఇచ్చారని జగన్ భజన చేశారు తప్ప.. వారంతా వారి కులానికి ఏం మంచి చేశారో ఒక్క ముక్క కూడా చెప్పలేదన్నారు. కనీసం కూర్చోవడానికి కుర్చీలు కూడా లేని పదవులు ఇచ్చినందుకు వైసీపీనేతలేబాధపడుతున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో కులాల వారిగా కార్పొరేషన్లకు రుణాలు, పని ముట్లు ఇతర సాయం అందించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగం చేకూర్చారని అన్నారు. కానీ మీకున్న పదవులు కేవలం నేమ్ బోర్డులు వేసుకునేందుకు మాత్రమే పరిమితమన్నది మీకు కూడా తెలిసిన సత్యమన్నారు...

**వాస్తవాలు మాట్లాడు కేతిరెడ్డి**

బస్సు యాత్ర సందర్భంగా కేతిరెడ్డి సామాజిక న్యాయం లాంటి గొప్ప గొప్ప వ్యాఖ్యలు చేశారని.. కానీ మన ధర్మవరం నియోజకవర్గంలో నువ్వు ఏ కులానికి ఏం న్యాయం చేశావన్నది చెప్పాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను హింసిస్తూ.. వారి ఆశలు, ఆస్తుల కూల్చివేతల మీద నీ అక్రమ ఆస్తులు సంపాదించుకున్నావన్నారు. మీ నాయకులు ఎస్టీల బోర్లు పూడిస్తే ఏ రోజైనా స్పందించావా? అని నిలదీశారు. బీసీలు, వైశ్యులు ఇళ్లు కూల్చినప్పుడు కానీ.. వారి భూములు అక్రమంగా కాజేసినప్పుడు నువ్వెందుకు స్పందించలేదన్నారు. తాడిమర్రిలో ఇళ్లు కూల్చినప్పుడు, ముదిగుబ్బలో ముస్లింల స్మశాన వాటికను కబ్జా చేసినప్పుడు, అలాగే బీసీల భూములను ఆక్రమించుకున్నప్పుడు ఎక్కుడున్నావని ప్రశ్నించారు. ధర్మవరం పట్టణంలో బీసీలను బెదిరించి నువ్వు ఆర్థికంగా స్థిరపడింది నిజం కాదా? అని నిలదీశారు. మాంగళ్య షోరూం లాంటి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మారి.. ధర్మవరంలో చేనేతలకు పండుగ రోజు వ్యాపారాలు లేకుండా చేసిన ఘనత నీదేనన్నారు. ఇందుకోసం చేనేతలు నీ దగ్గరకు వస్తే ఏం మాట్లాడావో గుర్చు చేసుకోవాలన్నారు. గతంలో సుమారు 14వేల మంది చేనేతలకు అందే సబ్సిడీ.. ఇప్పుడు నాలుగైదు వేల మందికి మాత్రమే ఎందుకొస్తోందో చెప్పాలన్నారు. ప్రతి రోజు గుడ్ మార్నింగ్ అని ఫోటోలు, వీడియోలు తీసుకుంటూ సోషియల్ మీడియాలో వైరల్ చేసుకునే నువ్వు.. వాటి మీద ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యల మీద పెట్టి ఉంటే ఎప్పుడో పరిష్కారం అయ్యేవన్నారు. ఏ కాలనీలో చూసినా డ్రైనేజీ, రోడ్ల సమస్యలు చెబుతున్నారని.. నువ్వు మరి రోజు ఎందుకు తిరుగుతున్నావని నిలదీశారు. మరోవైపు మా నమ్మకం నువ్వే జగన్ అని అంటించే స్టిక్కర్ల డబ్బుతో రోడ్ల సమస్య తీర్చవచ్చన్నారు.

**కులాల మధ్య చిచ్చు పెట్టవద్దు.. టీడీపీ బీసీల పార్టీ**

ధర్మవరంలో శ్రీరామ్ గెలిస్తే.. రెడ్లను ?ఒక్కర్నీ కూడా ఉండనివ్వరని నీ అనుచరుల చేత ప్రచారం చేయిస్తున్నావని.. ఇలా కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. నేను అన్ని కులాల కోసం పోరాడిన కుటుంబం, ప్రాంతం నుంచి వచ్చానని మాకు రెడ్లు ఎప్పుడూ శత్రువులు కాదన్నారు. రెడ్ల గురించి ఇంత ప్రేమ ఒలకబోస్తున్న కేతిరెడ్డి అండ్ కో... ఇదే రెడ్ల మీద దాడులు జరిగినప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. తుమ్మలలో ఆర్మీ జవాన్ పై దాడి జరిగినప్పుడు, జనసేన నేత రాజారెడ్డిపై దాడి జరిగినప్పుడు మీరు ఎందుకు స్పందించలేదన్నారు. తాము అందరితోనూ స్నేహపూర్వకంగా ఉంటామని.. మా వాళ్లను ఇబ్బంది పెట్టే వారిపై మాత్రం కచ్చితంగా ప్రతిచర్య ఉంటుందని శ్రీరామ్ హెచ్చరించారు. మరోవైపు టీడీపీ కేవలం కమ్మల పార్టీ అని.. చంద్రబాబు అరెస్ట్ తర్వాత కమ్మలు మాత్రమే నిరసనలు తెలిపారని కేతిరెడ్డి వ్యాఖ్యానించడం మీద తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు అరెస్ట్ తరువాత రాష్ట్రంతో పాటు దేశంలో అన్ని ప్రాంతాల్లోనూ అన్ని వర్గాలు నిరసనలు తెలియజేశారన్నారు. ఒక్క ధర్మవరంలోనే టీడీపీ నిరసనల్లో పాల్గొన్న వారి మీద మీరు పెట్టించిన కేసులను చూడాలన్నారు. కేసులు మోపబడిన వారిలో అన్ని కులాల వారు ముఖ్యంగా బీసీలు, రెడ్లు కూడా ఉన్నారన్నారు. ఇప్పటికైనా ఏదో వివేకానందుని తరహాలో ఫోజులు ఇవ్వడం మానేసి ప్రజా సమస్యల మీద ఫోకస్ పెట్టాలని హితవు పలికారు...

# జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ...



**తనకల్లు/ కదిరి నవంబర్ 6 (జనసూర్య శ్రీ) :** కదిరి మున్సిపాలిటీ, స్థానిక ఎన్జీవో కాలనీ వార్డు సచివాలయం పరిధిలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నందు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కదిరి శాసనసభ్యుడు డాక్టర్ పి వి సిద్ధారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదవారికి వరమన్నారు. ప్రతి పేద వారికి మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో జగనన్న మరో అడుగు ముందుకేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. దివంగత మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన ఆరోగ్య శ్రీ పథకం పేదవారికి ఆరోగ్య ప్రాణదాతగా నిలిచిపోయిందన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 1000 రూపాయల పైబడిన ప్రతి జబ్బును కూడా ఆరోగ్యశ్రీలో చేర్చడమే కాకుండా ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడే దినములకు ఆరోగ్య ఆసరా ద్వారా బృతిని అందజేయడం జరుగుతున్నదన్నారు. ఏఎన్ఎం ,సి హెచ్ ఓ లు ప్రతి ఇంటిని సందర్శించి ఆ కుటుంబ ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకొవడం, జబ్బు పడిన వ్యక్తిని గుర్తించి నిర్దేశిత తేదీ నాడు ఆ సచివాలయం పరిధిలో నిర్వహించు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రోజు వైద్యుల చేత మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. రోగి పరిస్థితిని బట్టి వారిని ఆసుపత్రికి కూడా తరలించే వసతులు కల్పించారన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి ప్రతి పేదవారికి కార్పొరేట్ వైద్యాన్ని ఇంటి వద్దనే అందించే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అందులో భాగంగా ప్రతి మండలానికి ఒక ప్రైమరీ హెల్త్ సెంటర్ ను ప్రతి సచివాలయం పరిధిలో క్లినిక్ సెంటర్ ను, అర్బన్ స్థాయిలో కదిరి మున్సిపాలిటీ సంబంధించి నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజా నాయకుడైన జగన్మోహన్ రెడ్డి ప్రజలందరి తరపున ధన్యవాదాలు తెలిపారు.

## కరువు బృందానికి స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే ఈరన్న



**మడకశిర నవంబర్ 6 (జన సూర్య (శ్రీ):-** తెలుగుదేశం పార్టీ ఏర్పాటుచేసిన కరువు బృందం ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు రోజులు పాటు పర్యటన చేనుంది భాగంగా మడకశిర నియోజకవర్గంలో నేడు మడకశిర మండలం ఉగ్రేపల్లి, కోడిగానపల్లి తదితర గ్రామాలలో వేరుశనగ చెట్లను ఇతర పంటలను పరిశీలించడం జరుగుతుంది. నేడు మడకశిర పట్టణానికి మాజీ వ్యవసాయ శాఖ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు కాలువ శ్రీనివాసులు, పుట్టపర్తి జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల కృష్ణప్ప, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి విచ్చేయుచున్నగా ఎన్టీఆర్ విగ్రహం దగ్గర మాజీ ఎమ్మెల్యే ఈరన్న వారందరికీ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలీగా కన్వీనర్ పాండురంగప్ప, మాజీ ఎంపీపీలు ఆదినారాయణ, అష్వతరామప్ప, రైతు సంఘ అధ్యక్షుడు రాజగోపాల్, ఉగ్ర నరసింహప్ప, సి కొడిగేపల్లి అశ్వత, నాయకులు రంగనాథ, తిమ్మప్ప, నాగరాజు తదితరులు భారీగా పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎంపీపీ జన్మదిన వేడుకలు



**మడకశిర నవంబర్ 6 (జన సూర్య (శ్రీ):-** పట్టణంలోని తెదేపా కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ ఆదినారాయణ పుట్టినరోజు ఘనంగా జరుపుకున్నారు. దీనికి మాజీ ఎమ్మెల్యే ఈరన్న మరియు నాయకులు పాల్గొని నిండు నూరేళ్లు ఆయువు ఆరోగ్య ఉండాలని కోరారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలీగ కన్వీనర్ పాండురంగప్ప, మాజీ ఎంపీపీ అశ్వితరామప్ప, రాజగోపాల్, నరసింహమూర్తి, రామకృష్ణప్ప, అంజి, తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ప్రభుత్వం ఇది ఎమ్మెల్యే

– ఉత్తుత్త కరువు పర్యటనేది



**మడకశిర నవంబర్ 6 (జనసూర్య (శ్రీ):-** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర ఆరు సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మడకశిర ఎమ్మెల్యే టీటీడీ పాలకమండలి సభ్యులు డాక్టర్ ఎం తిప్పేస్వామి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన భారతదేశంలోని ఏ రాజకీయ వేత్తగాని 341 రోజుల్లో, 3648 కిలోమీటర్లు పాదయాత్ర చేయలేదన్నారు. ఈ రికార్డును బద్దలు కొట్టాలంటే ఆయన్ని కాయనే సాటి అని కొన్ని ఆడారు. ఈ పాదయాత్రలో భాగంగా 2516 గ్రామాలు, 134 నియోజకవర్గాలు, 124 బహిరంగ సభలు, 55 ఆత్మీయ సమ్మేళనాలు చేసినటువంటి ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కిందని తెలియజేశారు. ఈ పాదయాత్రలో ప్రజల బాగోగులు తెలుసుకొని అందుకు అనుగుణంగా పరిపాలన చేపట్టడం చూస్తుంటే బడుగు బలహీన వర్గాల ప్రభుత్వమని చెప్పక తప్పదు అన్నారు. ఇలాంటి ప్రభుత్వం పైన ప్రతిపక్ష నేతలు మాట్లాడుతుంటే చూస్తూ ఉంటే ప్రజలు నవ్వుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఈరోజు కరువు పర్యటన చేస్తూ ఉంటే ఆస్పదంగా ఉంది అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు బాగోగులు పట్టాన్ని నాయకులు ప్రజల మెప్పుకోసం కరువు పేరున రావడం విడ్డూరంగా ఉంది అన్నారు ప్రజలు తమ శ్రేష్టలను గమనిస్తున్నారు. ఇప్పటికైనా తెదేపా నాయకులు బుద్ధి తెచ్చుకోవాలని హెచ్చరించారు. లేనియెడల 2019 ఎన్నికలలో ఎలాగైతే ఓట్లతో సమాధానం తెలియపరు చెప్పా రో అదేవిధంగా మళ్ళీ చెప్తారని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర మున్సిపల్ చైర్మన్ లక్ష్మీనరసింహ తనయుడు జయరాజ్, జెడ్పిటిసి నరసింహమూర్తి, ఎంపీపీ కవిత సత్యనారాయణ, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్లు రామిరెడ్డి, ఎంజాయ్ గౌడ్, కౌన్సిలర్లు, సర్పంచులు ఎంపీటీసీలు, గ్రామపంచాయతీ కన్వీనర్లు భారీగా నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు రైలు ఢీకొని చేనేత కార్మికుడు దుర్మరణం



**గుంతకల్లు నవంబర్6 (జన సూర్య శ్రీ ) :** గుంతకల్లు పట్టణంలోని ఏసీఎస్ మిల్లు కాలనీలో నివాసం ఉండే వగ్గా గోపాల్.(38 )అనే చేనేత కార్మికుడు సోమవారం రైలు ఢీకొని ప్రమాదవశాత్తు దుర్మరణం పాలయ్యాడు. గోపాల్ ఉదయాన్నే బహిర్భూమికి తమ ఇంటి సమీపంలో ఉన్న పొలాల వద్దకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా అకస్మాత్తుగా గుత్తి వైపు వెళ్లే ఓ రైలు ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాల్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. గోపాల్ చేనేత మగ్గం నేస్తూ కుటుంబ పోషణ చేసేవాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు జి ఆర్ పి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్రా తెలిపారు

# సమస్యలు పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి..

సమస్యల పరిష్కరించినప్పుడే సర్వసభ్య సమావేశానికి విలువ.

-ఎక్సైజ్, ట్రాన్స్కో, రవాణా, అధికారులు దుమ్మా.

**కుందుర్పి, నవంబర్, 6 ( జన సూర్య శ్రీ ):**-మండలంలో వివిధ శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరు నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీవో జీ , లక్ష్మినరసింహ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రమైన కుందుర్పిలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కమల నాగరాజు అధ్యక్షతన ఎంపీడీవో ఆధ్వర్యంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పిటిసి, రాధాస్వామి, వైస్ ఎంపీపీ, ఎస్సి, లక్ష్మి, తాసిల్దార్, విజయ్ కుమారి, సి ఎస్ డి టి, ఎంపీడీవో, అగ్రికల్చల్ ఏడి లు సభా వేదికపై ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. సమస్యలను అధికారులు పరిష్కరించినప్పుడే సర్వసభ్య సమావేశానికి విలువ ఉంటుందన్నారు. తొలత అధికారులు వివిధ శాఖల ప్రకారం జరిగిన అభివృద్ధిని వివరించారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారి దీప మాట్లాడుతూ ఇంతవరకు వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకొని లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కొక్క మరుగుదొడ్డికి ప్రభుత్వం రూ,15,000లు బిల్లును రెండు విడుతలుగా పునాదికి,రూ, 6,000లు పిట్ట బిగిస్తే ,రూ,9,000 లు బిల్లు మంజూరు చేస్తుందన్నారు. మహంతపురం, కుందుర్పి, గ్రామంలో స్మశానవాటిక లేక అనేక ఏళ్లుగా ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఎంపీటీసీ ఈరన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను గత సమావేశంలో అధికారులు దృష్టికి తీసుకువచ్చిన సమస్య పరిష్కారం కాలేదని తాసిల్దార్ దృష్టికి తెచ్చారు. ఈ సమస్య పరిష్కరిస్తామని తాసిల్దార్ తెలిపారు. జడ్పిటిసి రాధాస్వామి పలు శాఖల అధికారులు సమావేశానికి దుమ్మకొట్టగా జడ్పిటిసి అసంతృప్తం చేశారు. మాట్లాడుతూ అన్ని మండలాల్లో రైతులకు 9:00 గంటలు విద్యుత్ సరఫరా చేసిన, ఇక్కడ మండలంలో ఏడు గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారని, దీంతో రైతుల తీవ్రెక్కట్లేదనుకుంటున్నారని చెప్పారు. సమావేశానికి విద్యుత్ ఏఈ దుమ్మా కొడుతున్నారని, కళ్యాణదుర్గం విద్యుత్ లైన్ మార్చాలన్నారు జిల్లా ఎస్సీ తో మాట్లాడారు. కళ్యాణ్ దుర్గం బెస్తరపల్లి, జంబ గుంపల, రాత్రి 9 గంటల సర్వీస్ రద్దు చేశారని, యథావిధిగా ఈ సర్వీసును కొనసాగించాలని జడ్పిటిసి అన్నారు. బాల్యవివాహాలు మండలంలో అధికంగా జరుగుతున్నాయని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ సూచించారు. ఈ క్రమంలోనే 18 ఏళ్ళ లోపు వయసు కల బాలికలకు బాల్య వివాహం చేయగా, వీరికి పుట్టబోయే పిల్లలు సక్రమంగా జన్మించడం లేదన్నారు. బాల్య వివాహాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామన్నారు. మండలంలో బియ్యం కొందరికి సక్రమంగా అందడం లేదని జడ్పిటిసి సిఎస్ డిటి దృష్టికి తెచ్చారు. డీలర్లు బియ్యం లబ్ధిదారులకు అడ్జస్టైంట్ చేయలేదని నేను రిపోర్టర్ రాసి చర్యలకు తీసుకుంటామని సి ఎస్ డి టి తెలిపారు. జంబు గుంపలలో ఆరు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు ఉండడం లేదని, ఆరుమంది పిల్లలు వస్తున్నారు అని సర్పంచ్ గంగాధర అన్నారు. పిల్లలకు కార్యకర్తల విద్యాభ్యాసం చేయడం లేదన్నారు. సిడిపిఓ సూపర్వైజర్ లు కేంద్రాలు కేంద్రాన్ని పరిశీలించి చర్య తీసుకుంటామన్నారు. ఏపీఎం మాట్లాడుతూ ఎస్సీ మహిళకు ఆటో డ్రైవర్ లైసెన్స్ పొందితే నాలుగు లక్షల ఆటో మంజూరు చేస్తామని తెలిపారు. ఆ మహిళలు శ్రీనిధి ,ఉన్నతి సంఘాలలో ఎలాంటి బాకీలు ఉండరాదు అన్నారు. ప్రధాని జీవనజ్యోతి ఇన్సూరెన్స్ పథకంలో 18 నుండి 50 వయసు కల మహిళలు రూ,340 రుసుము కట్టితే, అలాంటివారు మృతి చెందితే బీమా పరిహారం అందుతుందన్నారు. వందేళ్ళ అనంతరం యంత్రాలతో భూ సర్వే వేగవంతం చేస్తున్నామని తాసిల్దార్ చెప్పారు. 20024 జనవరిలోగా భూ సర్వే ని పూర్తి చేస్తామని రైతులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జా చేశారని, వీటిని రీ సర్వేలో గుర్తించి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యుడు ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# పకడ్బందీగా భద్రతతో విధులు నిర్వహించాలి

ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలి.

సిఎం కాన్వాయ్ రిహార్సల్స్ పరిశీలించిన ... ఎస్పీ.



**పుట్టపర్తి రూరల్, నవంబర్ 6, (జనసూర్య శ్రీ):** నేడు రాష్ట్రంలోనే రైతులకు రైతు భరోసా పిఎం కిసాన్ సొమ్మును పుట్టపర్తి నుండి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి రాక సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టిందని ఎస్పీ ఎస్వీ. మాధవ్ రెడ్డి సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణంలో ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం బందోబస్తుకు విచ్చేసిన పోలీసు అధికారులకు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.సెక్టార్ ఇంచార్జ్ అధికారులకు బ్రీఫింగ్ చేసి పలు సూచనలు, సలహాలు జాగ్రతల గురించి తెలియజేశారు. పోలీసులు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. కేటాయించిన విధులలో పూర్తి బాధ్యతలతో విధులు నిర్వహించాలన్నారు. ఎటువంటి రిమార్కులు లేకుండా సమన్వయంతో బాగా పని చేయాలన్నారు.బహిరంగ సభ ప్రవేశ, నిష్క్రమణల దగ్గర యాక్సెస్ కంట్రోల్ వారు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహించరాదన్నారు సత్య సాయి విమానాశ్రమంలో బహిరంగ సభ, బ్యారికేడింగ్, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ , ఇతర భద్రత ఏర్పాట్ల గురించి ఎస్పీ ఎస్వీ. మాధవ రెడ్డి ఆరా తీసి పరిశీలించారు. సత్య సాయి విమానాశ్రయం చుట్టూ బందోబస్తు పకడ్బందీగా ఉండాలన్నారు.ముఖ్యమంత్రి వెళ్లే కాన్వాయ్ మార్గంలో జాగ్రత్తలు పాటించాలని వై జంక్షన్ లో ట్రాఫిక్ అంతరాయాలు జరగకుండా, సభ ముగిసిన వెంటనే ప్రజలు ఆ వైపు రాకుండా పోలీస్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు.బందోబస్తు విధులు నిర్వహించే పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు , పోలీసు జాగిలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలు, సెక్టర్ ఇంచార్జ్ అధికారులు , రూట్ బందోబస్తు ఆఫీసర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఉన్నతాధికారులకు సమాచారంఅందించాలన్నారు. ముఖ్యమంత్రి విమానాశ్రయం నుండి వెళ్లే వరకు పోలీస్ అధికారులకు కేటాయించిన పాయింట్లలో పూర్తిగా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీ సత్య సాయి, చిత్తూరు జిల్లాలకు చెందిన అడిషనల్ ఎస్పీలు, విష్ణు , సుధాకర్ ,విజయ్ భాస్కర్ రెడ్డి ,డిఎస్పీలు, వాసుదేవన్, శ్రీనివాసులు, హుస్సేన్ పీరా, కన్జక్షన్, కెవిఆర్ వరప్రసాద్, నర్సింగప్ప, విజయ నాయక్, ఎస్బిఐ రవీంద్రారెడ్డి, సిఐలు , ఎస్సైలు ఉన్నారు.

# కరవు మండలాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి



రైతులకు తక్షణ సాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

ఇప్పటి వరకు కనీసం పంట నష్టాన్ని కూడా అంచనా వేయలేదు

అసలు ప్రభుత్వం రైతుల గురించి ఆలోచిస్తోందా...?

కరువు రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలిబిమాజీ మంత్రి పరిటాల సునీత

**కూడేరు నవంబర్ 6 (జనసూర్యశ్రీ) :** ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరవు మండలాల రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని మాజీ మంత్రి పరిటాల సునీత డిమాండ్ చేశారు. కరవు ప్రాంతాల పరిశీలిన కోసం తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీ సభ్యులతో కలసి సునీత సోమవారం పర్యటించారు. కూడేరు మండలం ఇప్పేరు గ్రామ సమీపంలో రైతులు నష్టపోయిన వేరుసెనగ పంటను పరిశీలించారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా అంతటా కరవు పరిస్థితులున్నా..14మండలాలను కరవు ప్రాంతాలుగా ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలన చేసి అన్ని మండలాలను కరవు మండలాలుప్రకటించాలన్నారు. కేవలం ప్రటనలతోనే సరిపెట్టుకోకుండా.. రైతులను ఆదుకోవడానికి అక్కడ తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇవాళ సీఎం జగన్ జిల్లాకు వస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతానికి ప్రత్యేకప్యాకేజీప్రటించాలన్నారు. గతంలో కూడా ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ విషయంలో జిల్లా రైతులకు అన్యాయం చేశారని సునీత ఆరోపించారు. గత ఏడాది చెన్నేకొత్తపల్లి మండలానికి వచ్చినప్పుడు జిల్లా రైతులందరికీ సాయం అందించినట్లు చెప్పారని.. కానీ కేవలం కొంతమంది రైతులకే సాయం అందిందన్నారు. గత ప్రభుత్వంలో రైతులు నష్టపోతే క్రమం తప్పకుండా ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇచ్చే పరిస్థితి ఉండేదని.. కానీ ఇప్పుడు రైతులకు ఎలాంటి సాయం అందడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం ప్రకటించాలని.. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు విద్యుత్, నీరు అందించే ప్రయత్నం చేయాలన్నారు. రైతులకు ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు కావడం లేదని స్వయానా వైఎస్ఆర్సిపి నాయకులే ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి మొర పెట్టుకుంటున్నారని.. అయినా వారికి ఏమాత్రం పట్టడం లేదన్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. ఈ ప్రభుత్వానికి రైతులపై ధ్యాసనే లేదన్నారు. పండగలా వ్యవసాయం అని అబద్ధాలు చెబుతున్నారని.. ఈ రాష్ట్రంలోని ఏ జిల్లాలో రైతు సంతోషంగా ఉన్నాడో చూపించాలన్నారు. మరోవైపు జిల్లాలో తాగునీటి సమస్యకు ముప్పు పొంచి ఉందని.. అరకొర వస్తున్న హంద్రీనీవా నీటిని చిత్తూరు జిల్లాకు తీసుకెళ్లే విధంగా మంత్రి పెద్దిరెడ్డి అధికారాన్ని ప్రయోగిస్తున్నారని సునీత ఆరోపించారు. దీనిపై ముందే అధికారులు చర్యలు తీసుకుని.. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేయాలని సునీత డిమాండ్ చేశారు...

# టిడిపి వెంటే దళితులు గుంతకల్లు ఎస్సీ సెల్ నాయకులు



**గుంతకల్లు నవంబర్ 6 (జనసూర్య శ్రీ) :** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దళితులుపై దాడులు చేస్తున్న నేపథ్యంలో గుంతకల్లు నియోజకవ ర్గం ఇంచార్జ్, మాజీ శాసన సభ్యుడు ఆర్ జితేంద్ర గౌడ్ ఆదేశాల మేరకు గుంతకల్లు నియోజకవర్గం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం పక్కన పట్టణం లోని అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించి నిరసన తెలిపారు.ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎస్సీ పై దాడులు, ఆడపిల్లలపై అత్యాచారాలు పెరిగాయని ఇటీవల కంచికచర్ల లో ఒక దళిత సోదరులపై అగ్రకులాలకు చెందిన వ్యక్తులు చిత్రహింసలు పెట్టి అనుమానుషంగా ప్రవర్తించరాని వారిని అరెస్టు చేసి ఆ దళిత యువకుడిపై న్యాయం చేయాలనీ డిమాండ్ చేసారు,తమ ప్రభుత్వంలో మంత్రులను, ఎమ్మెల్యేలుగా దళితులను నిత్యం అవమానిస్తున్నారని ఈ సంఘటనలు చూసి రాష్ట్రంలో ఉన్న దళితులు టిడిపి తోనే అని ఒక్కటవుతున్నారిని తెలిపారు.యువ నాయకుడు అనిల్ గౌడ్ మాట్లాడుతూ దళితులు పైనే కాకుండా ఎస్టీ,బీసీలు, మైనార్టీలకు ఈ జగన్ ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని ఎక్కడ చూసిన ప్రశ్నిస్తే దాడులు ఎక్కువైపోయాయని మండిపడ్డారు. గత టీడీపీ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు దళితులకు అందించామని ఆలోచించి టిడిపికి ఓటు వేసి సైకోని సాగనంపాలని తెలిపారు..ఈ సందర్భంగా దళిత సోదరులు చేపట్టిన ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో జింకల జగన్నాథ్, దశరథ రామయ్య చికెన్ జగన్,మహదేవ్, నల్లబోతుల శ్రీనివాసులు, చికెన్ జగన్,బలరామ్,మాల రామాంజినేయులు, అంజలీ దేవి, లీలావతి,కేశప్ప, తలారి మస్తానప్ప, రామన్న చౌదరి, రంజాన్,ఫజులు,మాధవి,పద్మావతి,ఫ్రూట్ మస్తాన్,సుంకన్న,వాల్మీకి రాముడు, నాగరాజు,శేఖర్ , గుంతకల్లు ఎస్సీ సెల్ నాయకులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# గడపగడపకు మనప్రభుత్వంకార్యక్రమంలో



**గుంతకల్లు నవంబర్ 6( జన సూర్య శ్రీ ) :** గుంతకల్లు పట్టణంలో నందు 1వ వార్డు సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన వైఎస్సార్సీపీ యువ నాయకుడు జిల్లా కబ్బడి అసోసియేషన్ అధ్యక్షుడు మంజునాథ్ రెడ్డికి వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శి, 1వ వార్డ్ ఇంఛార్జి ఎం నాగేంద్ర , నాయకులు ఘన స్వాగతం పలికారు. గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతి రెడ్డి గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో విచ్చేసిన సందర్భంగా ఆమెకు గజమాలతో సన్మానించారు నాగేంద్ర తన అభిమానాన్ని చాటుకున్నారు. గడపగడప కార్యక్రమానికి విచ్చేసిన అధికారులకు నాయకులకు వైఎస్ఆర్సిపి అభిమానులకు నాగేంద్ర అల్పాహారం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి గడపకు నైరుతి రెడ్డి వెళ్లి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వారికి అందచేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# రైతు గర్జన ర్యాలీని జయప్రదం చేయండి



**డోన్: నవంబర్ 06: (జనసూర్య శ్రీ):** నేడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగే రైతు గర్జన ర్యాలీని జయప్రదం చేయాలని, నంద్యాల పార్లమెంటు జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి సోమవారం డోన్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిడబ్ల్యుసి మెంబర్ శ్రీ రఘువీరా రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రథసారథి పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, ఏఐసీసీ కార్యదర్శి శ్రీ మేయప్పన్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూల్ జిల్లా లో ని కర్నూల్ పట్టణములో రాజ్ విహార్ సెంటర్ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ ఉంటుందని ,రాష్ట్రంలో, దేశంలో రాక్షస పాలన జరుగుతుందని పేద ప్రజల పట్ల ఎటువంటి దయ,కనికరం లేదని, ధరలు ఆకాశాన్ని అంటుతున్నప్పటికీ వాటిని నియంత్రించ లేని పరిస్థితుల్లో ఉన్నారని పేద ప్రజలు, నిరుద్యోగులు, సామాన్య రైతులు, అనేక విధాలుగా నష్టపోతున్నారని ,వర్షాలు లేక ,పంటలు సరిగా లేక, అన్నదాత ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ ,ఈ పాలకులకు కరువు కనిపించలేదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు జిల్లాల్లో నంద్యాల జిల్లాలో కేవలం 6 మండలాలుగా ప్రకటించడం చాలా విడ్డూరమని ,వారన్నారు కావున ఈ పాలకుల యొక్క దాష్టికాన్ని ఎండగట్టడానికి రేపు 7 వ తేదీ జరిగే రైతు పోరు గర్జనకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు అందరూ వేలాదిగా తరలివచ్చి ర్యాలీని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి యు.జనార్ధన్, డోన్ పట్టణ అధ్యక్షుడు ఆర్.గోపినాథరావు,డోన్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుడు వై.శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలి : ఎన్ ఎస్ యు ఐ



**డోన్: నవంబర్ 06: (జన సూర్య శ్రీ) :** పట్టణంలోని ఇంటర్ డిగ్రీ చదువుకుంటున్న విద్యార్థులకు సొంత హాస్టల్ భవనం లేక సమస్యలతో పోరాడుతున్న విద్యార్థులకు ఖాళీగా ఉన్న పాతపేటలోని పాత మున్సిపల్ కార్యాలయాన్ని విద్యార్థుల సౌకర్యార్థం ఎస్సీ ఎస్టీ హాస్టళ్లకు కేటాయించాలని సోమ వారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పాలెం సుజాత రెడ్డి, నంద్యాల జిల్లా ఎన్ ఎస్ యు ఐ నాయకులు తెలుగు విజయ్ కుమార్ వినతి పత్రం అందజేశారు.అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పాలెం సుజాత రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ హాస్టళ్లకు కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు, డిగ్రీ కాలేజీలకు చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపించడం లేదని వారు అన్నారు..ఈ విషయమై ఎన్ ఎస్ యు ఐ నాయకులు తెలుగు విజయ్ కుమార్ వారి బృందంతో కలిసి మినిస్టర్ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి వివరించడానికి వెళ్తే వారి సమస్యలను పట్టించుకోపోగా వారిపై అక్రమ కేసులను వ్రాయించడం చాలా బాధాకరమని, మరి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న అధికారులు ,నాయకుల వారిపై ఎటువంటి కేసులు నమోదు చేయాలని వారు ప్రశ్నించారు..డోన్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మినిస్టర్ అయినా బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఒక్కసారి అయినా తమ నియోజకవర్గంలో ఉన్న ఎస్సీ ఎస్టీ హాస్టల్ సందర్శించకపోవడం చాలా బాధాకరమని వారన్నారు.ఇప్పటికైనా మినిస్టర్ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎస్సీ ఎస్టీ హాస్టల్ను సందర్శించి వెంటనే ఆ హాస్టల్ ను పాత మున్సిపల్ కార్యాలయానికి తరలించాలని లేనిపక్షంలో రాబోయే రోజుల్లో తాము కూడా విద్యార్థులు పట్టా అండగా నిలిచి పెద్ద ఎత్తున ఆందోళనలు, రాస్తారోకోలు తోపాటు జిల్లాలో ఎక్కడపడితే అక్కడ మినిస్టర్ను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు..ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నాయకులు సునీల్ శేఖర్ మధు అజయ్ తదితరులు పాల్గొన్నారు..

# చెక్ పోస్ట్ ల వద్ద చేతులు కలిపి.. అర్ధరాత్రిలో గోస్తాని నది ఇసుక దోపిడి..



పట్టించుకోని అధికారులు!

**అనంతగిరి (అల్లూరి జిల్లా) నవంబర్ 06 (జన సూర్య శ్రీ):-** మండలంలో ఉన్న ట్రాక్టర్ లారీల యాజమాన్యం గోస్తానీనది ఇసుకను అడ్డగోలుగా మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారు ఇసుక మాఫియా నుండి కాపాడిన అధికారులే కరువయ్యారు ప్రతిరోజు రాత్రి సమయంలో విచ్చలవిడిగా కొంతమంది ఇసుక దొంగలు ఐతన్నపాలెం వైపు నుండి మైదాన ప్రాంతనికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. కాశీపట్నం చిలకలగడ్డ వరకవొడ్డు జీలుగుపాడు గ్రామాల వద్ద ఇసుక కూడబెట్టి రాత్రి సమయంలో చెక్ పోస్ట్ ల వద్ద చేతులు కలిపి టన్నుల టన్నుల ఇసుకను తరలిస్తు కాసులు కూడ బెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను అరికట్టాలని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# జోరుగా కడప-తాడపత్రి రహదారి పనులు



**ఆర్ఎస్ కొండాపురం/తాడిపత్రి నవంబర్ 6 (జన సూర్య శ్రీ ) :** కడప జిల్లా ముద్దనూరు నుండి అనంతపురం జిల్లా తాడిపత్రి వరకు నాలుగు లైన్ల రహదారి పనులు జోరుగా సాగుతున్నాయి.రూ.425 కోట్ల పనులకు రూ.100 కోట్ల పనులు చేసినట్లు అధికారులు సోమవారం తెలిపారు.51 కిలోమీటర్ల రోడ్డు వేయాల్సి ఉండగా 16 కిలోమీటర్లు తారు రోడ్డు వేసి పూర్తి చేసినట్లు తెలిపారు. 59 చిన్న బ్రిడ్జిలకు గాను 35 బిడ్జిలు, 33 పైప్ లైన్ కల్వర్టర్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## ప్రజలందరు కలిసి చంద్రబాబు కు పట్టం కడుదాం రాయల్ వెంకటేష్



**గుంతకల్లు నవంబర్ 6 (జన సూర్య శ్రీ) :** గుంతకల్లు నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ శాసన సభ్యుడు ఆర్. జితేంద్ర గౌడ్ ఆదేశాల మేరకు గుంతకల్లు పట్టణం 10వ వార్డు నందు క్లస్టర్ ఇంచార్జ్ హనుమంతు , వార్డు ఇంచార్జ్ రాయల్ వెంకటేష్ ఆధ్వర్యంలో 6 రోజు వార్డు లో పర్యటించి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు జరిగింది. ఈ సందర్భంగా 10వ వార్డు ప్రజలతో మమేకమై అందరు కలిసి కట్టుగా ఉండి చంద్రబాబు ని ముఖ్యమంత్రి ని చేసి ఆయనకు పట్టం కడుదాం అని చంద్రబాబు వస్తేనే మళ్ళీ రాష్ట్ర పరిస్థితి మారుతుంది అని అన్నారు. కాబట్టి రాష్ట్ర ప్రజలందరికి ప్రత్యేక విన్నపం చేస్తున్నాము ఈసారి చంద్రబాబు కి ఓటు వేసి తెలుగుదేశం పార్టీ ని గెలిపించండి అని కోరారు.. ఈ కార్యక్రమం లో 10వ వార్డు టీడీపీ నాయకులు ప్రవీణ్, వినోద్,అర్జున్,దత్తు, దర్గా వలి, మధు, వేణు, సంజు,తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ ఆర్టిఐ తాత్కాలిక మండల కమిటీ ఎన్నిక.

ఈ కమిటీ కి భగత్ సింగ్ నామకరణం చేశారు.



**కుందుర్పి నవంబర్ ,6, (జన సూర్య శ్రీ ) :** మండల కేంద్రమైన కుందుర్పిలో స్థానిక ఆర్డిటి వాటర్ ప్లాంట్ సమీపంలో సోమవారం మండలంలోని అన్ని గ్రామాల సభ్యులతో కలిసి భగత్ సింగ్ ఆర్టిఐ తాత్కాలిక సమన్వయం కమిటీని ఎన్నుకున్నారు. కాగా తాత్కాలిక కమిటీ మండల అధ్యక్షుడుగా ,మల్లయనూరు గ్రామవాసి, ఎంజి ,శ్రీనివాసులు, కార్యదర్శిగా, నిజవళ్ళి గ్రామ రంగస్వామిలను ఏకగ్రీవంగా కమిటీ సభ్యులను 30 మందిని ఎన్నుకోవడం జరిగింది ఈ క్రమంలోనే నూతన కమిటీని ఎన్నుకున్న సందర్భంగా భగత్ సింగ్ ఆర్టిఐ మండల కమిటీ అని నామకరణం చేశామన్నారు . ఈ సందర్భంగా దీక్షలు కార్యదర్శులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పని కట్టు పెట్టినందుకు అంకితభావంతో పని చేస్తామన్నారు. అభివృద్ధి మాటను అవినీతికి పాల్పడితే ఆర్టిఐ చట్టం ద్వారా అవినీతిని అంతమొందించడానికి వజ్రాయుధంగా దోహదపడుతుందన్నారు. ఆర్ టి ఐ చట్టాన్ని సభ్యులు బలోపేతానికి స్వార్థం విడి, నిస్వార్థంతో కృషి చేసిలా పనిచేయాలన్నారు. ఈచట్టాన్ని ప్రతి ఒక్కరు దుర్వినియోగం చేయకుండా సద్వివినియెగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఆర్ టి ఐ మండల కమిటీ సభ్యులు గంగాధర ,బి ,గోపాల్ నాగ నాగభూషణ లు మహిళలు పాల్గొన్నారు.

## హిందూ అనాథ శవ అంత్యక్రియలు చేసిన ముస్లిం సోదరులు

కుల మతాల అడ్డుగోడల్ని కూలుద్దాం.

వసుధైక కుటుంబాన్ని నిర్మిద్దాం



**హిందూపురం టౌన్ నవంబర్ 6. (జన సూర్య శ్రీ) :** హిందూ పురం పట్టణం లో సేవా మందిరం పరిసర ప్రాంతాల్లో భిక్ష మెత్తు కు తిరుగుతూ మరణించిచాడు ఇతని శవం ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండు రోజులుగా అక్కడే ఉంది భిక్షగాడి ని ఎవరూ గుర్తించక పోవటంతో పరిగి సబ్ ఇన్స్ పెక్టర్ నరేంద్ర ఆదేశాల మేరకు ఏ ఎస్ ఐ హీదాయతుల్లా సమక్షంలో పంచనామా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ సహకారంతో ముస్లిం నగారా,ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్. సల్తనత్ -ఏ-ఖుదాతాత్ అధ్యక్షుడు అతీఖుర్రాహమాన్ టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన సంఘం సభ్యుడు అర్బాజ్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ సభ్యుడు షాహిద్. అర్బాజ్ తదితరులు జనరల్ కోవిడ్ స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతూ కుల మతాల అడ్డుగోడల్ని కూలుద్దాం వసుధైక కుటుంబాన్ని నిర్మిద్దాం అనే నినాదం తో మత సామరస్యం పరమత సహనం సోదర భావం అనే ఆచరణాత్మక ఆశయం తో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కోవిడ్ లేదా అనాథలు గా మరణించిన అభాగ్యులకు ఎవ్వరూ లేరని దిగులు పడకండి మా సామాజిక సంస్థ మిత్రబృందం ఆధ్వర్యంలో అంత్యక్రియలతో పాటు వారికి మానసిక భౌతిక సహాయ సహకారాలు అందించటానికి అనునిత్యం అత్యవసర సమయాలలో సహకారం అందిస్తామని అన్నారు. 9346943336 ఈ నెంబరుకు సంప్రదించాల ని విజ్ఞప్తి చేశారు కుల మతాలకు అతీతంగా దాదాపు అరువందలకు పైగా అనాథ కోవిడ్ ఎయిడ్స్ బాధితుల కు అంత్యక్రియలు నిర్వహించామని అత్యవసర శస్త్ర చికిత్సలకు రక్తం అవసరమైనా తమ సామాజిక సంస్థతో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమం లో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదములు తెలిపారు.

## నియామక పత్రం అందజేసిన జాతీయ చైర్మన్



**తాడిపత్రి / కొండాపురం నవంబర్ 6 (జన సూర్య శ్రీ) :** తాడపత్రి పట్టణంలో నంద్యాల రోడ్డులోని ఆఫీస్ నందు అభ్యుదయ హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ ఫోరం(సంస్థ ) రాయలసీమ చైర్మన్ పి. రాంబాబు, రాయలసీమ వైస్ చైర్మన్ బి. అమర్నాథ్ బాబు, ని అభ్యుదయ హ్యూమన్ రైట్స్ జాతీయ చైర్మన్ సగబాల రామాంజ నమ్మ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి అభ్యుదయ హ్యూమన్ రైట్స్ చైర్మన్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కె. మోహన్ ఏపీ జాయింట్ సెక్రెటరీ కె. నందిని, అనంతపురం మహిళా చైర్పర్సన్, కడప జిల్లా చైర్పర్సన్ జి. రోజా నాయుడు,హ్యూమన్ రైట్స్ సభ్యులు పాల్గొన్నారు.

# నాటి పాదయాత్ర ఫలితమే నేటి సంక్షేమం

- చరిత్రలో నిలిచేలా సాగిన ప్రజా సంకల్ప పాదయాత్ర
- రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా ప్రజాసంక్షేమ పాలన
- టీడీపీ హయాంలో అడుగడుగునా వంచన
- కేంద్రంలో భాగస్వామిగా ఉన్నా ఫలితం శూన్యం
- ఈనెల 9 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం
- ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతాం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ
- ఘనంగా ప్రజాసంకల్ప పాదయాత్ర ఆరేళ్ల వేడుక
- మహానేత వైఎస్ఆర్ విగ్రహానికి ఘన నివాళి
- కేక్ కట్ చేసి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణుల సంబరం



**అనంతపురం, బ్యూరో నవంబర్ 6 (జనసూర్యశ్రీ) :** రాష్ట్రంలో ప్రతిపక్ష హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర ఫలితాలే ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాలు అని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రజా సంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వైసీపీ శ్రేణులు నగరంలో వేడుకలు నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అక్కడే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ తెలుగుదేశం పాలనలో ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా సుదీర్ఘ పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. 341 రోజుల పాటు 3648 కిలోమీటర్లు ప్రజలతో మమేకమయ్యారని అన్నారు. నేను విన్నాను.. నేను ఉన్నాను అంటూ సాగిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందన్నారు. 2014లో జనసేన మద్దతుతో టీడీపీ, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమం శూన్యమని అన్నారు. ఆనాటి ప్రజాకంఠక పాలనపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని.. ఆ తర్వాత అదే ప్రజల విశ్వాసంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారన్నారు. పాదయాత్రలో ఏ కష్టాలైతే తెలుసుకున్నామో వాటికి పరిష్కార మార్గాలుగా పథకాలను రూపొందించి అమలు చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని తెలిపారు. కోవిడ్ వంటి పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు కొనసాగించామని గుర్తు చేశారు. ఈ రోజు అమ్మ ఒడి అందుతోందన్నా.. మహిళా సంఘాలకు రూ.19 వేల కోట్లు మాఫీ అయ్యాయన్నా.. పింఛన్ రూ.3 వేల వరకు పెరుగుతోందన్నా.. 45 ఏళ్లు నిండిన మహిళలకు వైఎస్ఆర్ చేయూత కింద ఏటా రూ.18500 అందుతోందన్నా.. అన్నీ కూడా నాటి ప్రజాసంకల్ప పాదయాత్ర ఫలితాలేనని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రజలకు ఇచ్చిన 98 శాతం హామీలను అమలు చేశామని తెలిపారు. రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలోనూ జరగని విధంగా రూ.800 కోట్లతో అనంతపురంలో అభివృద్ధి పనులు చేపట్టామని, ఇది సీఎంగా జగన్ ఉండడం వల్లే సాధ్యమైందని చెప్పారు. రూ.300 కోట్లతో సర్వజనాస్పత్రి విస్తరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు మంచి జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీలు మాత్రం ప్రజల దృష్టికి డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు 14 ఏళ్లు అధికారంలో ఉండి ఎందుకు సంక్షేమ పథకాలు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. వైద్య, విద్య రంగాల్లో ఎందుకు మార్పులు తీసుకురాలేకపోయారన్నారు. చంద్రబాబు పాలనకు, జగన్ పాలనకు తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఈనెల 9వ తేదీ నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ఈ రాష్ట్రానికి మళ్లీ జగన్ ఎందుకు అవసరమో ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. 76 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రజలకు మంచి జరగాలన్నా.. రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా సీఎం జగన్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్ర పోషించడంలో టిడిపి విఫలం

బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి విమర్శ.



**పుట్టపర్తి రూరల్, నవంబర్ 6 (జనసూర్య శ్రీ) :** రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించడంలో రాష్ట్రంలోని ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి విమర్శించారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్ష పాత్ర పోషించకపోవడంతోనే తాను వైకాపా విధానాలపైన మాట్లాడడం జరుగుతోందని పురందేశ్వరి తెలిపారు. సోమవారం శ్రీ సత్య సాయి జిల్లా పర్యటనలో భాగంగా పురందేశ్వరి సత్యసాయి జిల్లా కేంద్రంలో పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆమె ఈ విధంగా స్పందించారు. తాను రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవిని చేపట్టిన అనంతరం రాష్ట్రంలోని జిల్లాల పర్యటన చేయాలనే ఆలోచనలో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లాకు విచ్చేయడం జరిగిందన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా అంటేనే నందమూరి వంశానికి ప్రత్యేకమైన అభిమానం ఉందన్నారు. ముఖ్యంగా తన తండ్రి స్వర్గీయ నందమూరి తారక రామారావును ఈ జిల్లా ప్రజలు చాలా ప్రేమించారని ఆమె గుర్తు చేసుకున్నారు. ఒకరకంగా తాను శ్రీ సత్యసాయి జిల్లాలోకి రాగానే తన తండ్రి ఎన్టీ రామారావు ఆశీర్వాదం తనకు లభించినట్లుగా భావిస్తున్నానన్నారు. నందమూరి వంశం జిల్లా ప్రజలకు రుణపడి ఉన్నదని ఆమె అన్నారు. కాగా రాష్ట్రం విడిపోయిన అనంతరం కొత్త రాష్ట్రంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తూ అక్షర క్రమంలోనే కాకుండా అభివృద్ధి పరంగా కూడా ఆంధ్ర రాష్ట్రాన్ని ముందంజలో ఉంచాలనే లక్ష్యంతో కేంద్రంలోని మోడీ నాయకత్వ ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు ఇవ్వడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా పాతిక లక్షల పక్కా గృహాలను మంజూరు చేయగా గత ప్రభుత్వం కేవలం 3 ఇల్లను మాత్రమే నిర్మించింది. ఈ ప్రభుత్వం ఏ మేరకు ఇళ్లను నిర్మించిందో ప్రజలే చెప్పాలన్నారు. పెనుకొండ వద్ద గల గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పైప్లైన్ల ద్వారా హిందూపురం కు తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వమే ముందుకు వచ్చిందని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇదే సందర్భంలో జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం కోసం వందల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఇందులో 42 జాతీయ రహదారికి రూ.600 కోట్లు ఇచ్చి ధర్మవరం, కదిరి నియోజకవర్గం లో పనులు చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా పెనుకొండ, మడకశిర నియోజకవర్గం కొడికొండ చెక్ పోస్ట్ నుంచి కర్ణాటకలోని శిర వరకు రోడ్డు నిర్మాణం కు నిధులు ఇవ్వడం తెలిసిందేనన్నారు. ఇంకా సర్వ శిక్ష అభియాన్ కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు, విద్యార్థినులకు ఉచిత దుస్తులు, ఉచిత బూట్లు ,పుస్తకాలు పంపిణీ చేశారని పురందేశ్వరి వివరించారు .ఇలా రాష్ట్రంలోని అన్ని విషయాలలో కేంద్ర ప్రభుత్వమే సహాయపడుతుందే తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేసింది అంటూ ఏమీ లేదు .కానీ అనేక పథకాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి పేరు పెట్టుకోవడం జరిగిందని ఆమె తెలిపారు.

## మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి బీసీ ఆర్ దాస్..



**మడకశిర నవంబర్ 6 (జన సూర్య శ్రీ):-** ఈనెల 11వ తేదీన తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ మహానగరంలో మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభకు నియోజకవర్గంలోని మాదిగలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు బీ సీ ఆ ర్ దాస్ పేర్కొన్నారు. మడకశిర పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు చలో హైదరాబాద్ విశ్వరూపం మహాసభ కరపత్రికను ఆయన ఆవిష్కరించారు. అనంతరం డి హెచ్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మార్ హనుమంతు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఇచ్చిన సమాచారం మేరకు విశ్వరూపం మహాసభకు భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వస్తున్నట్లు చెప్పడం జరిగిందన్నారు. దేశ ప్రధాని మంత్రి మహాసభలో పాల్గొనడం మాదిగలు చేసిన పుణ్యమని త్వరలోనే ఎస్సీ వర్గీకరణ పై క్లారిటీ వస్తుందని నమ్మకం తమకుందని ఆయన ఆశాభావ%శీ% వ్యక్తంచేశారు. వైయస్సార్ సిపి 17వ వార్డ్ కౌన్సిలర్ నాగేంద్ర మాట్లాడుతూగత 30 ఏళ్ళు మాదిగలకల నెరవేర్చాల్సిన బాధ్యత భారత ప్రధానమంత్రిపైఉందన్నారు,కావున హైదరాబాద్ లో జరిగే సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నారాయణ మాట్లాడుతూ స్వయాన ప్రధానమంత్రి ఈ మహాసభలో పాల్గొంటారని చెప్పడం చూస్తుంటే మాదిగ,మాదిగ ఉపకులాల, ప్రజలకల నెరవేరినట్లేనని ఆయన అన్నారు. మైనార్టీ నాయకుడు నీస్సా ర్ అహ్మద్ మాట్లాడుతూ మాదిగ , దాని ఉపకులాల సామాజిక వర్గం పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఎస్సీ వర్గీకరణ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎరికల హక్కుల పరిరక్షణ సమితి నాయకుడు మాట్లాడుతూ 11వ తేదీ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ మహానగర%శీ%లో పేరేడ్ గ్రౌండ్లో తలపెట్టిన మాదిగల విశ్వరూపం మహాసభను జయప్రదం చేయుటకై నియోజకవర్గం లోని వేలాది మంది మాదిగలు తరలివచ్చి ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోఎమ్మార్పీఎస్,డిహెచ్పిఎస్, అనుబంధ సంఘ నాయకులు ప్రతి ఒక్కరు ఈ విషయన్ని గమనించాలని ప్రజలు దృష్టికితీసుకోపోవాలని డి.హెచ్.పి.ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మార్ హనుమంతు,నాయకులు శ్రీరామ్,ఈశ్వర్ కొల్లేష్,శివ,తదితరులు తెలిపారు.

## బాబు తోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ



వచ్చే ఎన్నికలలో టిడిపిని గెలిపిద్దాం

టిడిపి యూనిట్ ఇన్చార్జి చాంద్ భాషా

**కనేకల్ నవంబర్ 06(జన సూర్య శ్రీ) :** :చంద్రబాబు తోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ అని తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి రైతు డిపో చాందు భాష పేర్కొన్నారు. కనేకల్ పట్టణంలో నేసే పేట తదితర కాలనీలలో భవిష్యత్తుకు గ్యారెంటీ- బాబు గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ భవిష్యత్తు గ్యారెంటీ అంశాలను ప్రజలకు వివరించి ఈసారి తెదేపాకు మద్దతుగా నిలవాలని కోరారు, ఈ సందర్భంగా యూనిట్ ఇన్చార్జి చాంద్ భాషా మాట్లాడుతూ రైతు బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే అది తెలుగుదేశం పార్టీ చంద్రబాబు నాయుడు తోనే 2024 లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికులుగా పనిచేస్తున్నామన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరుతో మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్క ఏడాదికి 15 వేల రూపాయలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు 1500, దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుద్యోగులకు యువ గళం నిధి నుంచి నెలకు 3వేలు నిరుద్యోగ భృతి, ప్రతి రైతుకు ఏటా 20వేల ఆర్థిక సాయం, ఇంటింటికి మంచినీరు పథకం కింద ప్రతి ఇంటికి రక్షిత తాగునీటి కుళాయి కనెక్షన్, పేదలను సంపన్నులు చేయడానికి ప్రత్యేక పథక రూపకల్పన గురించి ప్రజలకు వివరించారు. ప్రతి యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్చార్జిలు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అనిల్,బిటి రమేష్,ముజ్జు, నాగరాజు,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు గర్జన ర్యాలీని జయప్రదం చేయండి

రాష్ట్ర కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. ఇందాదుల్లా ఖాన్.

**కదిరి నవంబర్ 6 (జనసూర్యశ్రీ).** కర్నూల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు 7న నిర్వహించనున్న రైతు మహా గర్జన ర్యాలీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కే.ఇందాదుల్లాఖాన్ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏపీ పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు, సిడబ్ల్యుసి సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డి, ఏపీ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, మీడియా సెల్ చైర్మన్ ఎన్ తులసి రెడ్డి, ఏపీ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ సైదా ప్రమా, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు జానీ , కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కర్నూలు పట్టణంలో రాజ్ విహార్ సెంటర్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు రైతు మహా గర్జన ర్యాలీ కార్యక్రమం జరగనుంది. దేశంలో రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది. పేద ప్రజలను ఆదుకునే కరవయ్యారు. నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దరల నియంత్రణ లోపించింది. రైతులు, నిరుద్యోగులు, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి దీనివలన పంటలు లేక అన్నదాతలకు ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు. ఈ పాలకులకు కరువు కనిపించదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు జిల్లాల జాబితా పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర స్థాయిలో కరువు పై విచారణ చేపట్టకనే కరువు మండలాల జాబితా ప్రకటన పట్ల రైతులు, రైతు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ పాలకుల యొక్క దాష్టికాన్ని ఎండ కట్టడానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు గర్జన ర్యాలీ కార్యక్రమం భారీ ఎత్తున తలిపెట్టింది. ఈ పోరు గర్జన ర్యాలీకి రాష్ట్రవ్యాప్తంగా రైతన్నలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు భారీ ఎత్తున పాల్గొని ర్యాలీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.




# బీసీలకు అధికార ప్రభుత్వం ద్రోహం

ఐక్య పోరాటానికి పిలుపునిచ్చిన రాజకీయ పార్టీలుబితెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్

బీసీలకు జరుగుతున్న అన్యాయం పై మద్దతుగా ప్రజా సంఘాలు, బీసీ కుల సంఘాల నాయకులుబివడ్డే వెంకట్

**నంద్యాల నవంబర్ 6 (జనసూర్యశ్రీ)** బీసీలకు అధికార వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహంపై ఐక్య పోరాటానికి పిలుపునిచ్చిన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు,బీసీ కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నంద్యాల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ అధ్యక్షతన నంద్యాలలో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డే వెంకట్ మాట్లాడుతూ బీసీలకు అధికార వైసీపి ప్రభుత్వం ద్రోహం చేస్తోందని రాజకీయంగా బీసీలను ఎదగనివ్వకుండా చేయాలనే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్రవ్యాప్తంగా బీసీల హక్కులపై ప్రశ్నించే బీసీ నేతలపై అక్రమ కేసులు పెట్టి దాడులు చేస్తున్నారని, బీసీలను గొప్పగా ఉద్ధరించామని చెప్పుకుంటున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ లు ఏర్పాటు చేసి ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండా చేసి బీసీలను దగా చేసిందని, కార్పొరేషన్ చైర్మన్ లకు కనీసం కుర్చీలు లేకుండా చేసి అవమానపరిచి సామాజిక బస్సుయాత్ర పేరుతో వైసీపీ ప్రభుత్వం బీసీలను మరో మారు దగా చేయడానికి ప్రయత్నిస్తోందని బీసీలకు పదవులు ఇచ్చి జగన్మోహన్ రెడ్డి సామాజిక వర్గం పెత్తనం చలాయిస్తోందని బీసీల కోసం బస్సు యాత్ర అని చెప్పి ఏ ఒక్క బీసీ నాయకుడి కి బస్సులో గాని,స్టేజ్ మీద గాని అవకాశం ఇవ్వడం లేదని అలాంటప్పుడు ఈ బస్సు యాత్ర బీసీలను మోసం చేయడానికి కాదా అని తెలిపారు. బీసీలలో కుల వృత్తులను నమ్ముకుని బ్రతికే వారికి రాయితీ కింద పనిముట్లు ఇవ్వని దుర్మార్గపు ప్రభుత్వమని నిత్యము బీసీలపై ఏదో ఒక చోట దాడులు జరుగుతున్నాయని ముఖ్యంగా బీసీలలో వడ్డెర కులస్తులపై రాష్ట్రవ్యాప్తంగా విపరీతంగా దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని వారి యొక్క భూములు లాక్కుంటున్నారని ప్రశ్నిస్తే హత్యలు చేస్తున్నారని తెలిపారు.ఈ విధంగా బీసీ లపై దాడులు చేసిన వారిపై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదని బాధింపబడిన వారి మీద అక్రమ కేసులు మోపి నిర్బంధాలకు గురి చేస్తున్నారని ఇది ముమ్మాటికి బీసీ వ్యతిరేక ప్రభుత్వమని తెలిపారు. ఈ సందర్భంగా బీసీలపై ప్రభుత్వ నియంత ధోరణి మీద రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం సంతోషకరమని ఈ సమావేశం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు, బీసీ కుల సంఘాలు,ప్రజా సంఘాలు కలిసికట్టుగా జగన్మోహన్ రెడ్డి నియంత పాలన పై పోరాడదామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపాల బాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మల్లె ఈశ్వర్, తెలుగుదేశం పార్టీ జోనల్ 4 కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ యాదవ్, తెలుగుదేశం పార్టీ జోన్ 5 కో ఆర్డినేటర్ ఎల్ఐసీ నర్సింహులు,నంద్యాల పార్లమెంట్ వడ్డెర సాధికార సమితి కన్వీనర్ పాలకూరి శంకర్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.



## కరవు మండలాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి



రైతులకు తక్షణ సాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

ఇప్పటి వరకు కనీసం పంట నష్టాన్ని కూడా అంచనా వేయలేదు

అసలు ప్రభుత్వం రైతుల గురించి ఆలోచిస్తోందా...?

కరువు రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలిబిమాజీ మంత్రి పరిటాల సునీత

**కూడేరు నవంబర్ 6 (జనసూర్యశ్రీ) ..**మ్మడి అనంతపురం జిల్లాలో కరవు మండలాల రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని మాజీ మంత్రి పరిటాల సునీత డిమాండ్ చేశారు. కరవు ప్రాంతాల పరిశీలిన కోసం తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీ సభ్యులతో కలసి సునీత సోమవారం పర్యటించారు. కూడేరు మండలం ఇప్పేరు గ్రామ సమీపంలో రైతులు నష్టపోయిన వేరుసెనగ పంటను పరిశీలించారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా అంతటా కరవు పరిస్థితులున్నా..14మండలాలను కరవు ప్రాంతాలుగా ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలన చేసి అన్ని మండలాలను కరవు మండలాలుప్రకటించాలన్నారు. కేవలం ప్రటనలతోనే సరిపెట్టుకోకుండా.. రైతులను ఆదుకోవడానికి అక్కడ తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇవాళ సీఎం జగన్ జిల్లాకు వస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతానికి ప్రత్యేకప్యాకేజీప్రటించాలన్నారు. గతంలో కూడా ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ విషయంలో జిల్లా రైతులకు అన్యాయం చేశారని సునీత ఆరోపించారు. గత ఏడాది చెన్నేకొత్తపల్లి మండలానికి వచ్చినప్పుడు జిల్లా రైతులందరికీ సాయం అందించినట్లు చెప్పారని.. కానీ కేవలం కొంతమంది రైతులకే సాయం అందిందన్నారు. గత ప్రభుత్వంలో రైతులు నష్టపోతే క్రమం తప్పకుండా ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇచ్చే పరిస్థితి ఉండేదని.. కానీ ఇప్పుడు రైతులకు ఎలాంటి సాయం అందడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం ప్రకటించాలని.. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు విద్యుత్, నీరు అందించే ప్రయత్నం చేయాలన్నారు. రైతులకు ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు కావడం లేదని స్వయానా వైఎస్ఆర్సిపి నాయకులే ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి మొర పెట్టుకుంటున్నారని.. అయినా వారికి ఏమాత్రం పట్టడం లేదన్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. ఈ ప్రభుత్వానికి రైతులపై ధ్యాసనే లేదన్నారు. పండగలా వ్యవసాయం అని అబద్ధాలు చెబుతున్నారని.. ఈ రాష్ట్రంలోని ఏ జిల్లాలో రైతు సంతోషంగా ఉన్నాడో చూపించాలన్నారు. మరోవైపు జిల్లాలో తాగునీటి సమస్యకు ముప్పు పొంచి ఉందని.. అరకొర వస్తున్న హంద్రీనీవా నీటిని చిత్తూరు జిల్లాకు తీసుకెళ్లే విధంగా మంత్రి పెద్దిరెడ్డి అధికారాన్ని ప్రయోగిస్తున్నారని సునీత ఆరోపించారు. దీనిపై ముందే అధికారులు చర్యలు తీసుకుని.. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేయాలని సునీత డిమాండ్ చేశారు...

## తెదేపా కరువు బృందం పర్యటన



**అనంతపురం నవంబర్ 6 (జన సూర్య శ్రీ)..** తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ మంత్రి తెలుగు రైతు రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు పత్తిపాటి పుల్లారావు ,కాలవ శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ,నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఉరవకొండ శాసనసభ్యులు పిఎసి చైర్మన్ ప య్యావుల కేశవ్, పరిటాల సునీతమ్మ సోమవారం ఉరవకొండ నియోజకవర్గం కూ డేరు మండలంలో వేరుశెనగ పంట పొలాలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం ఎకరంకు 30 వేల రూపాయలు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్ నాయుడు, నెట్టెం వెంకటేశులు, ఆదినారాయణ, కేశవరెడ్డి.గాజుల అదేన్న, రాయల్ మురళి, విశాలాక్షి స్వరూప తదితరులు పాల్గొన్నారు

## రహదార్లు అందంగా తీర్చిదిద్దండి: స్వప్నిల్ దినకర్

క్షేత్ర స్థాయిలో పర్యటించి అధికారులకు ఆదేశాలు.

**విజయవాడ బ్యూరో ఇన్చార్జ్** విజయవాడ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. సోమవారం ఉదయం అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కే.వి.సత్యవతి, అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్ సురేష్ తో కలిసి గన్నవరం ఎయిర్పోర్ట్ కారిడార్ పనుల పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలించారు. మెషిన్లతో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరుగుతుందా లేదా అని దగ్గరుండి తనిఖీ చేశారు. ఫుట్ పాత్ ఇరువైపులా అలాగే డివైడర్ ఇరువైపుల పరిశుభ్రంగా ఉండాలని ఆదేశాలు ఇచ్చారు. ఎయిర్పోర్ట్ కారిడార్ను ఎంతో సుందరంగా రహదారులను అందంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వార్డ్ నెంబర్ 25, 26 ఏలూరు రోడ్లో పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలించి ఫుట్పాత్లపై ఉన్న అనధికార ఆక్రమణలను తొలగించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. సిల్టును ఎప్పటికప్పుడు శుభ్రంగా చేసేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని శానిటరీ ఇన్స్పెక్టర్లకు ఆదేశించారు. అక్కడున్న పారిశుద్ధ కార్మికులకు ఫుట్పాత్లు, రోడ్లు కచ్చితంగా శుభ్రంగా ఉండేలా చూడాలని హెచ్చరిం చారు. తదుపరి బందర్ రోడ్ లో ఉన్న సబ్ కలెక్టరేట్ సర్వీస్ స్టేషన్ ను సందర్శించారు. పారిశుద్ధ్య నిర్వాహణకు ఉపయోగపడే వాహనాల డీజిల్ ఫిల్లింగ్ విధానాన్ని తనిఖీ చేశారు. అక్కడున్న సిబ్బందిని అడిగి ఫ్యూయల్ డిస్ట్రిబ్యూషన్ రికార్డును పరిశీలించారు. పారిశుద్ధ నిర్వహణ వాహనాలు ఏ సమయంలో డీజిల్ ఫిల్లింగ్ కోసం వస్తున్నాయని పరిశీలించటానికి అక్కడున్న రికార్డులను చూసి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య వాహనాల ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ పక్కగా జరుగుతుందా లేదానేది ఈ పరిశీలన ముఖ్య ఉద్దేశమన్నారు.

## కొండాపురంలో ఉచిత ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయండి



**ఆర్ ఎస్ కొండాపురం నవంబర్ 6 ( జన సూర్య శ్రీ ) :** కొండాపురం పట్టణంలో ఉచిత ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుచున్నారు. పట్టణంలో పలు కాలనీలలో నీటి సమస్య తీవ్రంగా ఉందని దానికి తోడు తాగే నీళ్లు కూడా కరువైపోయాయని పలు కాలనీలలో ఉచిత ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని పట్టణంలోని ప్రజలు అధికారులను కోరుచున్నారు. ప్రతి చిన్న గ్రామంలో కూడా ఆరో ప్లాంట్ ఏర్పాటు చేశారని కొండాపురం పట్టణం మండల కేంద్రమైన అభివృద్ధిని అధికారులు పట్టించుకోలేదన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాల పై చర్యలు తీసుకోవాలి

ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్



**హిందూపురం టౌన్ నవంబర్ 6. (జన సూర్య శ్రీ ) ..** హిందూపురం పట్టణంలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో పదవ తరగతి గదిలో లో పైకప్పు రాలి 5 మంది విద్యార్థులకు రక్తపు గాయాలు అయ్యాయి ఈ సంఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు స్పందించి చైతన్య పాఠశాల ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులు ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు విద్యార్థులు కనీస సౌకర్యాలు రక్షణ లేకుండా ఈ పాఠశాల నడుపుతున్నారని అన్నారు విద్యార్థుల తల్లిదండ్రులు కట్టే ఫీజుల పైన ఉన్న ప్రేమ విద్యార్థుల పైన లేదని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈ పాఠశాల వ్యవహరిస్తుందని అన్నారు ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు ఈ సంఘటన పైన విచారణ జరిపి చైతన్య పాఠశాల యాజమాన్యం పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘం నాయకులు సంపత్ కుమార్ బాబావలి చంద్రశేఖర్ రెడ్డి నాగభూషణ అభి రవి జై చంద్ర మోమిన్ భాష పాల్గొన్నారు

## మోతే లో కారు జోరు ప్రచారం.





**దుబ్బాక నవంబర్ 6 (జన సూర్య శ్రీ,)** దుబ్బాక నియోజకవర్గం అక్బర్ పేట మండలం పరిధిలో మోతె గ్రామంలో సోమవారం బి ఆర్ ఎస్ పార్టీ జోరుగా కారు గుర్తు ఓటు వేయాలని ప్రచారం స్పీడ్ అందుకుంటోంది. ఈ గ్రామ సర్పంచ్ కాలేరుశ్రీనివాస్ ఉప సర్పంచ్ మానస రంజిత్,గ్రామ అధ్యక్షుడు కుమ్మరి రవి కుమార్,బోరం రాజేశ్వర్,కుమ్మరి చారి,రమేష్,చిద్రమైన రమేష్,పోచయ్య,తలారి చద్రం,వడ్డే.నారాయణ,బి ఆర్ఎస్ సినియార్ నాయకుడు కొత్త రాజిరెడ్డి జోరుగా ప్రచారం కోనసాగించారు. ఈ సందర్భంగా కాలేరు శ్రీనివాస్ మాట్లాడుతూ కత్తిపోటుకు గురైనా చికిత్స పొందుతున్న దుబ్బాక బి ఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపుకు కార్యకర్తలే అండగా నిలబడ్డారు. తదిరులు పాల్గొన్నారు

## సీఎం పర్యటనను అడ్డుకుంటాం.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చద్దు రాష్ట్ర ఎరుకల సేవా సమితి అధ్యక్షుడు

భయాన్ని వీడండి జాతి హక్కుల సాధనకై నిరంతరం శ్రమించండి

ప్రాణాలైనా అర్పిస్తాం, హక్కుల సాధిస్తాం




**పామిడి నవంబర్ 06 (జన సూర్య శ్రీ) ..** భయాన్ని వీధి జాతి హక్కుల సాధనకై నిరంతరం శ్రమించాలని అవసరమైతే ప్రాణాలు అర్పించి హక్కుల సాధన కోసం పోరాడాలని ఏపీ రాష్ట్ర ఎరుకుల ప్రజా పోరాట సమితి అధ్యక్షుడు అన్నారు.గత కొన్ని ఏళ్లుగాఎరుకుల కులస్తులు పడుతున్న కష్టాల్ని కనికరించే నాథుడు లేక పెళ్ళాం పిల్లలు కూడా పోషించుకోలేని స్థితిలో ఎరుకల జాతి ప్రయాణం చేస్తుంది. దేశానికి స్వతంత్రం వచ్చి 76 ఏళ్ళు కావస్తున్న ఎస్సీ ఎస్ టి కులాల బతుకులు ఇంకా మారలేదు మాకు రావాల్సిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ కింద ఏ హక్కు కూడా ఏ పథకం కూడా అందలేదు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎస్సీ ఎస్టీ పథకాలు దాదాపుగా 29 పథకాలు రద్దు చేశారు ఎరుకల హక్కుల సాధనకై నిరంతరం నాయకులకు దగ్గరికి అధికారుల దగ్గరికి వేసుకున్న చెప్పులు తిరుగు గుతున్న సమస్యలు ఎక్కడ వేసిన గొంళిలు అక్కడే ఉన్నాయి ప్రభుత్వానికి ఒకటే చెబుతున్నాం గిరిజన పట్ల తక్కువ చూపు చూడడాన్ని హెచ్చరించారు . రాష్ట్రంలో 139 కార్పొరేషన్లు ఏర్పాటుచేశారు. ఎరుకల వారికి ఓన్లీ కమిషన్ తో సరిపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ కార్పొరేషన్ లో చైర్మన్లు పెదవులు ఇచ్చినంత మాత్రాన పదిమంది నెంబర్లను చూపించి రాష్ట్ర ప్రభుత్వం దళిత గిరిజనులు మోసం చేస్తోంది వివక్షతకు గురి చేస్తున్న నాయకులకు నేను చెప్పేది ఒకటే ఎరుకుల కులస్తులకు నిరుద్యోగత చాలా కొరతగా ఉంది ఇండస్ట్రియల్ గా ఉపాధి లేక చెడు దారులు పడుతున్నారు ఎన్నికల ముందు కరేపాకు లాగా మా జాతిని వాడుకొని తప్పుదోవ నయకులు పట్టిస్తున్నారు . ఉమ్మడి అనంతపురం సత్య సాయి జిల్లా విచ్ఛేయుచున్న జగన్మోహన్ రెడ్డి ని అడ్డుకుంటామని హెచ్చరించారు.సిఎం తీసుకున్న నిర్ణయం లో 52 జీవో నెంబర్ బోయలను ఎస్టీ జాబితాలో చేస్తామని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిన వాటిని వెనక్కి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

Printer,Publisher and owned by: OGETI BHASKARA, printed at M/S Bhaskara publications,Bhairava nagar,anantapuramu, Andhra Pradesh,Published from Dno 5/134, 7th cross, Bhairava nagar,anantapuramu,515001. State editor:ogeti BhaskaraCell :9440520683Email.bhaskar.ogeti@gmail.com R.N.I.no-APTEL16159